తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
అన్నమయ్య
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 101 పేజీలు: 10+4 వెల: 6.50




SHOWROOMS: ANDHRA PRADESH: RENAULT KURNOOL Ph: 8527234838. RENAULT ONGOLE Ph: 9582547709.

# భారత్ ఎవరికీ తలవంచదు..

>> ఈ దివ్య సాన్నిధ్యం, ఈ సౌందర్యం, భూమి, ఆకాశం నుండి కురుస్తున్న పుష్ప వర్షం, కాషాయ జెండాల కాంతి, కళ, సంగీతం, నృత్యాల అమృత ప్రదర్శనలు, వేద మంత్రాల పఠనం, గర్భగుడిలో నిరంతరం జరుగుతున్న శివ పంచాక్షరి పారాయణం, వీటన్నిటితో పాటు సముద్రపు అలల ఘోష... సృష్టి అంతా ఏకమై "జై సోమనాథ్! జైజై సోమనాథ్" అని పలుకుతున్నట్టు అనిపిస్తోంది!" అని ప్రధాని మోడీ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. భారత ఆధ్యాత్మిక శక్తి, సాంస్కృతిక చైతన్యాన్ని ఈ అమృతోత్సవం ప్రతిబింబిస్తుందని అన్నారు. పునర్నిర్మించిన ఆలయంలో మహాదేవుని ప్రతిష్ఠ జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం జరిగిందని, ఇది 'వెయ్యేళ్ల అమరత్వ ప్రయాణాన్ని' ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. 'తన మూలాలకు కట్టుబడి ఉంటూనే, ఆధునికత శిఖరాలను చేరుకోవడానికి సిద్ధంగా ఉండే భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పానికి సోమనాథ్ అమృత్ మహోత్సవం ప్రతీక' అని అన్నారు. 'సత్యాన్ని అణిచివేయవచ్చు కానీ తుడిచివేయలేమని ఈ సోమనాథ్ ఆలయం మనకు బోధిస్తుంది. విశ్వాసాన్ని సవాలు చేయవచ్చు కానీ ఓడించలేము' అని ఆయన వ్యాఖ్యానించారు. పవిత్ర పుణ్యక్షేత్రం వారసత్వానికి గుర్తుగా ఒక స్మారక తపాలా బిళ్లను, నాణేన్ని కూడా విడుదల చేశారు.

**పోఖ్రాన్ అణు పరీక్షల ప్రస్తావన:** 1998లో భారతదేశం నిర్వహించిన పోఖ్రాన్ అణు పరీక్షలను దేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం అనుసంధానించారు. పోఖ్రాన్ అణు పరీక్షల వార్షికోత్సవం సోమనాథ్ వేడుకలతో ఒకే సమయంలో రావడం విశేష ప్రాముఖ్యతను కలిగి ఉందని ప్రధాని మోడీ అన్నారు. "ఈ రోజు మరొక కారణం వల్ల కూడా ప్రత్యేకమైనది. సరిగ్గా ఇదే రోజున, అంటే 1998 మే 11న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో ప్రోఖ్రాన్-2 పేరుతో అణు పరీక్షలను నిర్వహించింది" అని పేర్కొన్నారు. "మన శాస్త్రవేత్తలు ప్రపంచం ముందు భారతదేశ బలాన్ని, సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ప్రపంచవ్యాప్తంగా అలజడి రేగింది. ప్రపంచ అగ్రరాజ్యాలు వ్యూహరచన చేయడం ప్రారంభించాయి. అనేక ఆంక్షలు విధించబడ్డాయి, ఆర్థిక అవకాశాలకు దారితీసే అన్ని మార్గాలూ మూసివేయబడ్డాయి" అని ఆయన అన్నారు. ఈ పరీక్షల తర్వాత భారతదేశం తీవ్రమైన అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, రెండు రోజుల తర్వాత అదనపు అణు పరీక్షలను నిర్వహించి ముందుకు సాగిందని ప్రధానమంత్రి తెలిపారు. "మే 11న శాస్త్రవేత్తలు తమ పనిని పూర్తి చేశారు, కానీ మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించబడ్డాయి. భారతదేశ రాజకీయ సంకల్పం ఎంత దృఢమైనదో అప్పుడు ప్రపంచం గ్రహించింది" అని ఆయన అన్నారు. "ఆ సమయంలో, ప్రపంచం మొత్తం భారతదేశంపై ఒత్తిడి తెస్తోంది. కానీ అటల్ జీ నాయకత్వంలో, మాకు దేశమే సర్వస్వం అని బిజెపి ప్రభుత్వం నిరూపించింది. ప్రపంచంలో ఏ శక్తి కూడా భారతదేశాన్ని తలవంచేలా చేయలేదు, లేదా ఒత్తిడికి లొంగేలా బలవంతం చేయలేదు. "శివుడితో పాటు శక్తిని ఆరాధించడం ఎప్పటి నుంచో మన సంప్రదాయంగా వస్తోందని, అందుకే ఈ అణు పరీక్షలకు "ఆపరేషన్ శక్తి" అని పేరు పెట్టారని ప్రధాని మోడీ తెలిపారు. "అర్ధనారీశ్వరుడైన శివుడు కూడా శక్తితోనే పరిపూర్ణమవుతాడు" అని ఆయన అన్నారు. ఈ అంశాన్ని భారతదేశ చంద్రయాన్ యాత్రతో కూడా ప్రధానమంత్రి అనుసంధానించారు. "చంద్రయాన్ యాత్ర విజయవంతమైనప్పుడు, చంద్రునిపై భారతదేశ రోవర్ దిగిన ప్రదేశానికి "శివ శక్తి పాయింట్" అని పేరు పెట్టడం మీకు గుర్తుండే ఉంటుంది" అని ఆయన అన్నారు. "ఎందుకంటే మన విశ్వాసంలో, చంద్రుడు శివునితో, శివుడు శక్తితో ముడిపడి ఉన్నారు. ఈ జ్యోతిర్లింగాన్ని సోమ అంటే చంద్రుడు అనే పదం నుండి సోమనాథ్ అని పిలవడం ఎంత ఆహ్లాదకరమైన విషయం. "శివశక్తి" తత్వం భారతదేశ శాస్త్రీయ, సాంకేతిక పురోగతికి స్ఫూర్తినిస్తూనే ఉందని ప్రధాని మోడీ అన్నారు. "శివశక్తి ఆరాధన అనే ఈ తత్వం దేశ శాస్త్రీయ పురోగతికి స్ఫూర్తినిస్తూనే ఉండాలి" అని ఆయన అన్నారు.

ఆపరేషన్ శక్తి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరీక్షలను భారత దేశ సంకల్పానికి, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి నిదర్శనంగా అభివర్ణించారు. 1951లో పునర్నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమనాథ్ అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా, ప్రధాని మోడీ సోమవారం సోమనాథ్ ఆలయంలో కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత వైమానిక దళానికి చెందిన సూర్య కిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శించిన వైమానిక ప్రదర్శనను వీక్షి ంచారు.



సోమవారం సోమనాథ్ ఆలయం వద్ద పోస్టల్ స్టాపులు, నాణెం విడుదల చేస్తున్న ప్రధాని మోడీ

## సోమనాథ్ ఆలయం భారతదేశ నాగరికత, ఆత్మగౌరవానికి శాశ్వత చిహ్నం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే11, ప్రభాతవార్తప్రతినిధి:** సోమనాథ్ అమృత్ మహోత్సవం సందర్భంగా భక్తు లకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలను తెలి యజేశారు. మన దేశం విశ్వాసాలను గౌరవించే భూమిగా సీఎం అభివర్ణించారు. ఈ విశ్వాసం మనం దరినీ ఏకంచేసే గొప్ప శక్తిగా నిలుస్తుంద న్నారు. సోమనాథ్ ఆలయం భారతదేశ నాగరికత, ఆత్మగౌరవానికి శాశ్వత చిహ్నంగా నిలుస్తుందని కొని యాడారు. ఆలయ పునర్నిర్మాణానికి అంకితమైన వారి త్యాగాలకు, భక్తికి ఇది నిదర్శనంగా సీఎం చంద్రబాబు భావించారు. వికాస్ భీ, విరాసత్ భీ స్ఫూర్తిని ఎన్డీయే ప్రభుత్వం అందిపుచ్చుకుందన్నారు.

# దేశ పురోగతిని ఆపలేరు

>> దోహద పడుతుందని అన్నారు. ఒకప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచిన పశ్చిమ బెంగాల్, గత కొంతకాలంగా అభివృద్ధి ఆలోచనలే లేకుండా వెనుకబడిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు.1990లలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఎన్నో అవకాశాలు కల్పించాయని, టెలికాం, విద్యుత్, రహదారుల రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. ఆ సంస్కరణల్లో తాను కూడా భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు.ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ప్రోజ్యూమర్‌ఖి (ఉత్పత్తిదారువినియోగదారు) విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా నష్టాలను తగ్గిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారని, దీని ద్వారా భూసారాన్ని పెంచుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నామని వివరించారు. ప్రతీ సవాలు ఒక అవకాశాన్ని సృష్టిస్తుందని, భారత్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని (అన్‌స్టాపబుల్), త్వరలోనే దేశం ఒక గ్లోబల్ జెయింట్‌గా మారుతుందని చంద్రబాబు అన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని ఆయన స్పష్టం చేశారు.

# లింక్‌కు అనుమతులివ్వండి

>> వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయినట్టు తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీఎంబర్సు చేయాలని జలశక్తిశాఖ మంత్రికి చంద్ర బాబు విజ్ఞప్తిచేశారు. ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రధానమంత్రి కృషి సీంచాయి యోజన కింద రాష్ట్రంలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చిన సీఎం." హర్ ఖేత్ కో పానీ "కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృధాగా పోయే 200 టీఎంసీల వరద జలాలలను మళ్లించేలా పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్టు వెల్లడించారు.. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్ధంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా కేంద్ర జలశక్తి శాఖకు లేఖ ఇచ్చిన సీఎం చంద్రబాబు వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి గెజిట్ ప్రకారం ముందుకెళ్తామన్నారు. సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కేంద్రమంత్రి పాటిల్ తో భేటీ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కరవు రహితంగా మార్చే ప్రాజెక్టు పోలవరమని అన్నారు. కేంద్రం అందిస్తున్న సహకారానికి మంత్రి నిమ్మల ధన్యవాదాలు తెలియజేశారు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి కానుందని పేర్కొన్నారు. ప్రధాని చేతుల మీదుగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. వైఎస్సార్సీపీ పట్టించుకోని తుంగభద్రకు మొత్తం గేట్లను కొత్తవి నిర్మిస్తున్నామని అన్నారు. గోదావరికావేరి నదుల అనుసంధానం యాక్షన్ ప్లాన్ తయారీపై కేంద్రమంత్రి పాటిల్‌తో చర్చించామని నిమ్మల వెల్లడించారు.





సోమవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి సిఆర్‌పాటిల్‌కు జ్ఞాపికను అందచేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నిమ్మల

# వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం

>> సమకూర్చారు. ఇందులో 4 ఆపరేషన్ టేబుళ్లు, 5మల్టీపారా మానిటర్లు, వీన్ ఫైండర్లు, రోగుల విశ్రాంతి కోసం 20 కుర్చీలను అంద జేసి, వాటిని తక్షణమే వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే బాధ్యతారాహిత్య సిబ్బందిపై కఠినంగా ఉం టామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్‌డిఓ ఎం.కృష్ణ మూర్తి, ఆసుపత్రి ఇన్చార్జి సూపరిం టెండెంట్ డాక్టర్ మహారాజ్, పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

**టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా దర్బార్ :** స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు స్వీకరించారు. అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు భారీగా తరలివచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం వహించకూడదని అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, ఆర్డీఓ ఎమ్.కృష్ణ మూర్తి, తహసిల్దార్ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

**13 మంది విద్యార్థులను అభినందించిన మంత్రి:** ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర విద్యా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అత్యుత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన వెంటనే రూపొందించిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అద్భుత ఫలితాలను ఇచ్చింది. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కాకాణిపై మరో కేసు నమోదు

>>పట్ల నిరసిస్తూ కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. న్యాయం అడిగిన బాధితుడిని ఎటు వంటి రిపోర్టులు లేకపోయినా పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హనీఫ్ తీవ్రంగా కొట్టి బెదిరించి కొట్టడాన్ని వీడియో తీసి ఆయన్ను ఆదేశించిన టిడిపి శ్రేణులకు పంపి ఎస్ఐ అవాచికంగా వ్యవహరించాడని ఆరోపణతో కాకాణి గోవర్ధన్ రెడ్డి వైసిపి శ్రేణులతో కలిసి స్టేషన్ ముందు నడి రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కానీ దురుసుగా వ్యవహరించిన ఆ ఎస్ఐ పై విచారణ ఏమైందో తెలియదు కానీ నిరసన వ్యక్తం చేసిన కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైసిపి నాయకులపై ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగించారంటూ తాజాగా ఎస్ఐ మరో కేసును నమోదు చేసారు. ఈ విషయమై సర్వత్రా కేసు విషయం చర్చనీయాశమైయింది.

# నీట్ 2026 పేపర్ లీక్!

>> సరిపోలాయని గుర్తించింది. ఈ గెస్ పేపర్ కేరళలోని ఒక మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థికి చెందినదని , అతను మే 1న తన స్నేహితుడికి ఇవ్వగా అది వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కోచింగ్ , పీజీ సెంటర్లలోని విద్యార్థులకు చేరిందని తేలింది. గెస్ పేపర్ ను ఒక్కో అభ్యర్థికి భారీ మొత్తాలకు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు సుమారు 13 మంది అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేసి లోతుగా విచారిస్తున్నారు.

**లీకు వార్తలపై ఎన్‌టిఏ స్పందన:** ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం పై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) స్పందించింది. దీనిపై ఆదివారం ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న వార్తలను కొట్టిపారేసింది. 2026 మే 3న పరీక్ష పూర్తి భద్రతా ప్రోటోకాల్‌లతో నిర్వహించామని పేర్కొంది. ప్రశ్నాపత్రాలు జిపిఎస్ ట్రాకింగ్ వాహనాల ద్వారా, ప్రత్యేక వాటర్‌మార్క్ గుర్తులతో రవాణా చేయబడ్డాయని తెలిపింది. పరీక్షా కేంద్రాల్లో ఏ ఐ ఆధారిత నిఘా వుంటుందని స్పష్టం చేసింది. అయితే మే 7 రాత్రి పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత పరీక్షకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందిందని తెలిపింది. మీడియాలో వస్తున్న వార్తలు, కొందరిని అదుపులోకి తీసుకోవడాలు తదితర చర్యల్లో పాల్గొంటున్న సంస్థలకు కృతజ్ఞతలు తెలిపింది. విచారణకు కావలసిన సహకారాన్ని ఎన్ టి ఏ అందిస్తోందని స్పష్టం చేసింది. నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థుల కృషి , నిబద్ధతపై ఎలాంటి సందేహం లేదని పేర్కొంది. ఈ తరహా వార్తలు కలిగించే ఆందోళనను తమకు తెలుసని, దర్యాప్తు సంస్థలు తమ పని పూర్తి చేయడానికి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించింది.

**తెలుగు రాష్ట్రాల నుండి 1.50 లక్షలకు పైగా విద్యార్థుల్లో ఆందోళన:** డాక్టరు అవ్వాలనే కల నెరవేర్చుకునేందుకు దేశవ్యాప్తంగా సుమారు 22.05 లక్షల మంది విద్యార్థులు నీట్ 2026 పరీక్షకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుండి 58 వేలకు పైగా విద్యార్థులు, పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుండి సుమారు 91వేలకు పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు.అయితే ఈ లీక్ వ్యవహారంతో విద్యార్థులు , తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు స్పందిస్తూ నీట్ పరీక్ష పై వస్తున్న ఆరోపణలు లక్షలాది విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. 2024లో జరిగిన అక్రమాల తర్వాత కూడా 2026లో మళ్లీ ఇలాంటి వివాదం రావడం ఎన్‌టీఏ భద్రతా వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతోం దని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం పై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో లేదా సీబీఐ నేతృత్వంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, ఎన్ టి ఏ భద్రతా ఏర్పాట్లు, ప్రశ్నాపత్రం సిద్ధం చేసే ప్రక్రియ, కోచింగ్ సెంటర్ల పాత్రను పూర్తిగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

# డిజిటల్ వాణిజ్య కారిడార్

>> ముఖ్యంగా సింగపూర్, ఏపీలోని విశాఖపట్నం . కృష్ణపట్నం పోర్టు మధ్య ఒక డిజిటల్ వాణిజ్య కారిడార్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశాంఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "సీఫుడ్, వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాలు, ఫార్మాస్యూటికల్ రంగాల్లో వాణిజ్య అనుసంధానం కోసం సీఐసీ సహకారం ఆశిస్తున్నా అన్నారు.. సీఐసీకి చెందిన బ్లాక్‌చెయిన్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి కాగిత రహిత వాణిజ్యం, సరుకు రవాణాలో పారదర్శకత తీసుకురావచ్చు. దీని కోసం ఏపీలోని ఓడరేవుకు, సింగపూర్‌కు మధ్య డిజిటల్ వాణిజ్య కారిడార్‌ను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలి" అని కోరారు.కోవిడ్ మహమ్మారికి ముందు సీఐసీ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి చైనాకు మిర్చి ఎగుమతి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని, అయితే సంస్థాగత మద్దతు కొరవడటంతో ఆగిపోయిందని లోకేష్ గుర్తుచేశారు. "ఆ వాణిజ్య కారిడార్‌ను పునరుద్ధరించడం ద్వారా గుంటూరు మిర్చికి కొత్త మార్కెట్‌ను అందించవచ్చు. ఇందుకు సీఐసీ తమ ప్లాట్‌ఫాం ద్వారా సహకరించాలి. రాష్ట్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓ) నాణ్యమైన సరుకును గ్రేడింగ్ చేసి సరఫరా చేస్తాయి. కొనుగోలుదారులతో అనుసంధానం, వాణిజ్య ఫైనాన్సింగ్ వంటి విషయాల్లో సీఐసీ తోడ్పాటు అందించాలి. ముందుగా మిర్చి ఎగుమతులపై పైలట్ ప్రాజెక్టు ప్రారంభిద్దాం" అని లోకేశ్ సూచించారు. ఇందుకోసం సీఐసీ తన చైనా కొనుగోలుదారుల నెట్‌వర్క్‌ను, ఫైనాన్స్ యంత్రాంగాన్ని క్రియాశీలం చేయాలని కోరారు.

**రౌండ్‌టేబుల్ సమావేశానికి సూచన**

మిర్చితో పాటు ఏపీ నుంచి ఎగుమతికి అనువైన ఇతర సరుకులను గుర్తించేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. "ఏపీలోని ఎగుమతిదారులు, సీఐసీ, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్, ఎస్‌జీఎక్స్‌లను ఒకచోట చేర్చి ఖిఏపీ-సింగపూర్ జాయింట్ కమాడిటీ ట్రేడ్ రౌండ్‌టేబుల్‌ఖి సమావేశాన్ని నిర్వహించాలి" అని ఆయన సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణపై దృష్టి సారించిందని, తద్వారా రాష్ట్ర ఉత్పత్తులను ప్రపంచానికి ఎగుమతి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, మిర్చి ఎగుమతుల్లో 4045 శాతం వాటా కలిగి ఉందని వివరించారు.

**ప్రతిపాదనలు పరిశీలిస్తామన్న సీఐసీ సీఈవో**

మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై సీఐసీ సీఈవో గ్లోరియా ఊ సానుకూలంగా స్పందించారు. తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా కొనుగోలుదారులు, అమ్మకందారులు, లాజిస్టిక్స్ ప్రొవైడర్లను అనుసంధానించే ఒక డిజిటల్ బీ2బీ మార్కెట్‌ప్లేస్ అని ఆమె వివరించారు. బ్లాక్‌చెయిన్ ఆధారిత భద్రత, ఒకే క్లిక్‌తో కస్టమ్స్ క్లియరెన్స్, సప్లై చైన్ ఫైనాన్స్ వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని గ్లోరియా వూ హామీ ఇచ్చారు.

# 14న రాష్ట్ర కేబినెట్ సమావేశం

**విజయవాడ మే 11 ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను 13వ తేదీ ఉదయం 11 గంటల్లోగా సాధారణ పరిపాలన శాఖకు పంపాలని అన్ని శాఖలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఏపీ పెట్టుబడుల మండలి సమావేశం ఆమోదించిన అంశాలు మూడు రోజుల అసెంబ్లీ నిర్వహణ తదితర అంశాలపై మంత్రి మండలి సమావేశంలో చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

# కానిస్టేబుల్ దారుణ హత్య

>> సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, టూ టౌన్ సీఐ అప్పల నాయుడు, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ నిందితులు కదలికలపై ఆరా తీస్తున్నారు.ఈ ఘటన పాత కక్షలా లేక వ్యక్తిగత కక్షల అనేదానిపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పడవ మునిగి ఇద్దరు మృతి

**గుంటూరు, మే 11 ప్రభాత వార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా జిల్లా నరసరావుపేట మండలంలోని కాకాని చేపల చెరువులో పడవ మునిగి ఇద్దరు కూలీలు మృతి చెందారు.చేపలకు ఆహారం వేసేందుకు సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ముగ్గురు కూలీలు పడవలో వెళ్లారు. ఈ క్రమంలో పడవ అదుపు తప్పి చెరువులో బోల్తా పడింది. ముగ్గురిలో ఒకరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా మరో ఇద్దరు చెరువులో మునిగిపోయారు.గల్లంతైన వారు పిట్టంబండ్ల హస్సాన్ బుడే (53),అగ్రహారం హుస్సేనా (32)లుగా గుర్తించారు. గజ ఈతగాళ్ళ సహాయంతో ఫైర్ సిబ్బంది, స్థానికులు చెరువులో గాలింపు చేపట్టగా హస్సాన్ బుడే మృతదేహం లభ్యమయ్యింది. మరొకరి కోసం ఫైర్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

# హోంమంత్రి అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. సోమవారం ఉదయం హోం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు.. విభజన హామీలు, పెండింగ్ ప్రాజెక్టలతోపాటు నిధుల కేటాయింపులపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలతో పాటు గతంలో హామీ ఇచ్చిన మేరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేశారు. విభజన అంశాలతో పాటు వివిధ పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల్ని మంజూరు చేయాలని ఆయన కేంద్ర హోం మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్ లో చేసిన కేటాయింపులతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.పోలవరం ప్రాజెక్ట్ సత్వరం పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేసారు.అమిత్‌షా,చంద్రబాబుల మధ్య ఇటీవల అయిదు రాష్ట్రాల ఎన్నికలు,ముఖ్యంగా బెంగాల్ ఎన్డీఏ విజయం తదితరంశాలపై కీలక చర్చ జరిగిందని సమాచారం. ఏపీలో తాజా రాజకీయ పరిణామాలు,కూటమి ప్రభుత్వ విధానాల అమలపై ఈ బేటీలో ప్రస్తావనకు వచ్చిందంటున్నారు.ఇక ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్‌తో సహా నీతిఆయోగ్ సభ్యులతో సీఎం సమావేశం కానున్నారు.



సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమైన సిఎం చంద్రబాబు

## నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం

**విజయవాడ,మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర శ్రీలంక తీరం, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం నెలకొంది. దాంతో రాగల 48 గంటల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశముంది. దాని ప్రభావంతో రేపు పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి వర్ష సూచన ఉంది. రేపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూ.గో, ప.గో, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, జిల్లాల్లో వర్ష సూచన ఉం డగా, తిరుపతి, పోలవరం, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల వడగాలులు వీచే అవకాశముంది. ఇక విజయవాడలో 42.3, ఏలూరు జిల్లా కుక్కునూరులో 42.1డిగ్రీలు,కూనవరం (పోలవరం)లో 42.1, మంత్రాలయంలో 41.5 డిగ్రీలు కొప్పెరపాడు (ప్రకాశం)లో 41.4, కడపలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కానుంది. అదే విధంగా తాడేపల్లి (ప.గో.)లో 41.2, అచ్చంపేట (పల్నాడు)లో 40.9 డిగ్రీలు, రాయదుర్గం (అనంతపురం)లో 40.8,పెదపారుపూడి (కృష్ణా)లో 40.7డిగ్రీలు, దోర్నిపాడు (నంద్యాల)లో 40.7, నందనమారెళ్ల (మార్కాపురం)లలో 40.6 డిగ్రీలు నమోదు కానుంది.

## ప్రజా అర్జీలపై త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలి

**శ్రీకాకుళం, మే 11 ప్రభాతవార్త :** పబ్లిక్‌గ్రీవెన్స్ కార్యక్రమంలో స్వీకరించే ప్రజా అర్జీలను త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 62 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని చట్టప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదులపట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీ లించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# అమరావతిలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం

>> బృందానికి అధికారులు వివరించారు. నగరంలో 40 కిలోమీటర్ల మేర భారీగా 'అవెన్యూ ప్లాంటేషన్' (పచ్చదనం) చేస్తున్నారు. రాజధానిలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆ రిజర్వాయర్ల పైన ఎకో టూరిజం తరహాలో భారీ పర్యాటక ప్రాజెక్టులను రూపొందిస్తున్నామన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్ పొడవు 7.8 కిలోమీటర్లు ఉంటుంది. ఇందులో ప్రత్యేకంగా బోటింగ్ సదుపాయం తీసుకురానున్నారు.5 వేల స్క్వేర్ మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లు చేశారు. ఆ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పర్యాటక ప్రాజెక్టుల రూపకల్పన కోసం ఇప్పటికే నిపుణులైన ఆర్కిటెక్టులను నియమించినట్లు వెల్లడించారు. వీటన్నింటితో పాటు రాజధాని ప్రజల కోసం అత్యున్నత స్థాయి రవాణా వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ కూడా ప్రపంచ బ్యాంకు బృందంతో పాటే ఉన్నారు. క్షేత్రస్థాయి పనుల పరిశీలన అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి వెళ్లింది.

అక్కడ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన క్వాంటం కంప్యూటర్ సెంటర్‌ను వారు ఎంతో ఆసక్తిగా చూశారు. అక్కడ విద్యార్థులు, అధ్యాపకులు చేస్తున్న సాంకేతిక, పరిశోధనా కార్యకలాపాలను యూనివర్సిటీ అధికారులు బృందానికి వివరించారు. సాంకేతికత వినియోగంపై బృందం హర్షం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ సందర్శన పూర్తయిన తర్వాత ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం తిరిగి సీఆర్డీఏ కార్యాలయానికి చేరుకుంది.

అక్కడ ఏపీ సీఆర్డీఏ కమిషనర్ విజయ రామరాజుతో ప్రతినిధుల బృందం సమావేశమైంది. ప్రస్తుతం అమరావతిలో జరుగుతున్న భారీ భవనాల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో కమిషనర్ వారికి వివరించారు.

మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పురోగతి గురించి ప్రపంచ బ్యాంకు బృందానికి కమిషనర్ విజయరామరాజు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

12-05-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
దశమి మ.2.46
పూర్వాభాద్ర రా.1.13
వర్జ్యం : ఉ.7.46-ఉ.9.21
దు.ఉ.8.11-ఉ.9.02, 2) రా.11.38-రా.12.29
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** బాధ్యతల వెనుక ఉన్న క్లిష్టమైన సమస్యలు ఒక్కొక్కటిగా మీ ముందుకు వస్తాయి. వాహన యోగం కలదు.

**వృషభం:** సంతాన పురోగతిపై పునః పరిశీలన చేసి కొన్ని కొత్త నిర్ణయాలు అమలు చేస్తారు.కుటుంబ గౌరవానికి హాని ఉండదు.

**మిథునం:** ప్రతిష్ఠ పెరుగుతుంది. కొనుగోలు, అమ్మకాలు విషయాలు లాభిస్తాయి. అప్రయత్నంగా పనులు పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** కొద్దిపాటి ఒడిదుడుకులు మినహా ఈ రోజు సాఫీగా సాగుతుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా వుంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**కన్య :** కుటుంబ విషయములో ఇతరుల జోక్యం అధిక మౌతుంది. పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**తుల :** ఓర్పు బాగా అవసరము. ఋణ యత్నము ఫలిస్తుంది. మీకు రావలసిన ప్రతిఫలము కొద్దికొద్దిగా చేతికి అందుతుంది.

**వృశ్చికం:** విదేశీ వస్తువుల ఆకర్షణనుండి బయట పడుటకు జాగ్రత్త వహించండి. స్థిరాస్తి విషయములో ఒక నిర్ణయమునకు వస్తారు.

**ధనుస్సు:** శ్రేయోభిలాషుల సలహాలు సంప్రదింపులు పాటించడం మంచిది. స్వయంగా వాహనాలు నడపకపోవడం మంచిది.

**మకరం:** చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించ గలుగుతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు.

**కుంభం:** అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం:** శుభకార్యములకు బహుమతులకు చందాలను, ధనమును అధికంగా ఖర్చు చేయవలసి వస్తుంది. మిత్రుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
అన్నమయ్య
: fb.com/vaartha Digital
Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 101 పేజీలు: 10+4 వెల: 6.50

హోంమంత్రి అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ
2లో

నైరుతి బంగాళా ఖాతంలో అల్పపీడనం

# దేశ పురోగతిని ఆపలేరు

## గ్లోబల్ జెయింట్‌గా భారత్ ఆవిర్భావం

## క్వాంటం, ఎఐ, ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఎంతో అభివృద్ధి

## ప్రధాని సూచించిన 8 అంశాలతో ముందుకు

## సిఐఐతో సుదీర్ఘ అనుబంధం: సిఎం చంద్రబాబు



సోమవారం న్యూఢిల్లీలో జరిగిన సిఐఐ సమ్మిట్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే11,ప్రభాతవార్తప్రతినిధి:**దేశ స్వయం సమృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచిన 8 అంశాల జాతీయ మిషన్‌ను ప్రతిఒక్కరూ స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంస్కరణల వాది అయిన ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థానానికి చేరుతుంది అన్నారు.తాజ్ ప్యాలస్ లో జరుగుతోన్న సీఐఐ బిజినెస్ సమ్మిట్‌కు హాజరై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ సీఐఐతో నాకు సుదీర్ఘ అనుబంధం ఉంది. పెట్టుబడుల గురించి సీఐఐతో కలిసి పనిచేశాను అన్నారు.దేశ ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలే నా అజెండా.అన్నారు.నాలెడ్జ్, టెక్నాలజీ, ట్రస్ట్, స్పీడ్ అనే అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా పోటీ ఉందిఅన్నారు.పరిశ్రమల ఎకోసిస్టమ్, పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఐఐ చాలా కృషి చేసింది. 1990లో వచ్చిన సంస్కరణలను అందిపుచ్చుకుని మనం అంతా కలిసి ముందుకు వెళ్లాంఅన్నారు.క్వాంటం, ఏఐ, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్, ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్ రంగాలను అందిపుచ్చుకునేలా మనం పనిచేస్తున్నాంఅన్నారు. వేర్వేరు రంగాల్లో గ్లోబల్ ట్యాలెంట్ కూడా మనకు ఉంది అన్నారు.దేశానికి సరైన చోట సరైన నాయకుడుగా ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారు అన్నారు. ఆర్థిక సంస్కరణలు దేశానికి చాలా అవకాశాలు కల్పించాయి. చాలా ఆవిష్కరణలకు కారణం అయ్యాయి. టెలికామ్ డీరెగ్యులేషన్, ఓపెన్ స్కై పాలసీ, విద్యుత్ సంస్కరణలు, రహదారులు లాంటి విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ సంస్కరణల్లో నేను కూడా భాగస్వామిని కావటం సంతోషంగా ఉంది అన్నారు.ప్రస్తుతం దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయి అన్నారు.పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో మంచి ఫలితాలు వచ్చాయి గతంలో పశ్చిమ బెంగాల్ దేశానికే ఆదర్శంగా ఉండేది. కాని గత కొంత కాలంగా ఆ రాష్ట్రానికి అభివృద్ధి ఆలోచనలే లేకుండా పోయాయి అన్నారు. 8 అంశాలతో కూడిన నేషనల్ మిషన్ ను ప్రధాని మోదీ ప్రజలకు ఇచ్చారు.బంగారం కొనుగోలును వాయిదా వేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, విద్యుత్ ఉత్పత్తిని కూడా సూచించారు. ప్రతీ ఇల్లూ, పరిశ్రమ, పొలం అన్నీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కావాలి. ప్రజా రవాణాను వినియోగించాలని కూడా ప్రధాని స్పష్టంగా పేర్కొన్నారు. యుద్ధానంతర పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు మనం చూశామన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అన్న నినాదాన్ని కూడా ప్రధాని ఇచ్చారు. దానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు మనకు ఉన్నాయి. గ్రేటర్ సెల్ఫ్ రిలయన్స్ అనే అంశాన్ని ప్రధాని ప్రస్తావించారు. ప్రకృతి సేద్యం అన్నది ఓ కీలకమైన అంశంగా మారింది.తద్వారా ఎరువుల దిగుమతి తగ్గుతుంది. మనం స్వయం సమృద్ధి సాధిస్తాం. ఈ జాతీయ టాస్క్ ను మనం అంతా కలిసి సాధించాలి. ప్రతీ సవాలూ ఓ అవకాశాన్ని మనకు సృష్టిస్తుంది.

**దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్:** ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలోప్రోజ్యూమర్ (ఉత్పత్తిదారువినియోగదారు) విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా విద్యుత్‌సరఫరా నష్టాలను తగ్గిస్తున్నామన్నారు. ప్రకృతి సేద్యం వల్ల ఎరువుల దిగుమతి తగ్గి దేశం స్వయం సమృద్ధి సాధిస్తుంది. ప్రకృతి సేద్యం వల్ల ఎరువుల దిగుమతి తగ్గి దేశం స్వయం సమృద్ధి అన్నారు. మొతమ్మీద ఇది ఒక జాతీయ టాస్క్ అని, దీన్ని అందరూ కలిసికట్టుగా సాధించాలని ఆయన అన్నారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ లభించారని చంద్రబాబు ప్రశంసించారు. సంస్క రణల వాది అయిన మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశం లో సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయని, ఇది అభివృద్ధికి >>2


సోమవారం సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రధాని మోదీ

# భారత్ ఎవరికీ తలవంచదు..

## దేశ అభేద్య స్ఫూర్తికి సోమనాథ్ ప్రతీక

## మన 'ఆపరేషన్ శక్తి' దుర్భేద్యం

### పోఖ్రాన్ అణుపరీక్షలతో భారత్ శక్తి ప్రపంచానికి వెల్లడి

### సోమనాథ్ అమృతోత్సవాలలో 'మహాపూజ'లు నిర్వహించిన ప్రధాని మోడీ

### ప్రత్యేక పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల

**గిర్ సోమనాథ్(గుజరాత్), మే 11:** గుజరాత్‌లోని ప్రభాస్ పటాన్‌లో సోమవారం నిర్వహించిన "సోమనాథ్ అమృత్ మహోత్సవ్" వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, సోమనాథ్ ఆలయాన్ని భారతదేశపు "అభేద్య స్ఫూర్తికి", "నాగరిక చైతన్యానికి" ప్రతీకగా అభివర్ణించారు. శతాబ్దాలుగా విధ్వంసాలు, దండయాత్రలు ఎదురైనా పదేపదే పుంజుకునే దేశ సామర్థ్యానికి ఈ ఆలయం ప్రతీక అని అన్నారు. "జై సోమనాథ్", "హర హర మహాదేవ్" నినాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, "ప్రభాస్ పటాన్ ప్రాంతం ఒక ప్రత్యేకమైన ఉత్సాహంతో నిండిపోయింది. దైవిక కాంతితో వెలిగిపోతోంది" అని కొనియాడారు. "ఈ మహాదేవుని >>2

# అమరావతిలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం

**విజయవాడ.మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో. ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో చేపడుతున్న వరద నియంత్రణ ప్రణాళికలు, పర్యాటక అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులను ఈ బృందం క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించింది. రాజధానిపై భవిష్యత్తులో వరద ప్రభావం పడకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ప్రతినిధుల బృందం ఎన్16 జంక్షన్ సమీపానికి చేరుకుంది. అక్కడ వేగంగా జరుగుతున్న గ్రావిటీ కెనాల్ అభివృద్ధిపనులను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్, సీఎండీ లక్ష్మీ ్మ పార్థసారథి వరద నియంత్రణ చర్యలను ప్రపంచ బ్యాంకు బృం దానికి వివరించారు. వందేళ్లలో ఎప్పుడూ లేనంత వరద వచ్చినా సులభంగా తట్టుకునేలా ఒక బృహత్తర ప్రణాళికను రూపొం దించామని బృందానికి స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ ఆధారంగా వాగులు, కాలువలను వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు. రాజధాని పరిధిలోని చెరువుల అభివృద్ధి పనులను కూడా ఎంతో శాస్త్రీ యంగా చేపడుతున్నామని ఆమె వివరించారు. అమఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలను కూడా >>2



## మాజీ మంత్రి కాకాణిపై మరో కేసు నమోదు

**పొదలకూరు (నెల్లూరు), మే 11, ప్రభాత వార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లా వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై కేసుల నమోదు పర్వం ప్రారంభమైయ్యింది. దాదాపు 25 కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్షుడుగా కాకాణి ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఏదో ఒక కారణం చూపిస్తూ కేసులు పెడుతున్నారని వైసిపి ఆరోపణ చేస్తోంది. ఏది ఏమైనా తాజాగా ఓ రైతు విద్యుత్ కనెక్షన్ విషయంలో పొదలకూరు విద్యుత్ ఎఇ లంచం తీసుకుని మరీ పని చేయకుండా తెలుగుదేశం నాయకులతో చెప్పియమని చెప్పటంతో ఈ విషయం కాస్త బయటకు పొక్కింది. వైసిపి శ్రేణులపై కక్ష సాధిస్తున్న తెలుగుదేశం నాయకుల తీరు పట్ల విద్యుత్ శాఖ ఎఇ అవినీతి >>2

# నీట్ 2026 పేపర్ లీక్!




### పరీక్షకు ముందు కేరళ నుండి రాజస్థాన్ విద్యార్థులకు గెస్ పేపర్

### సుమారు 140 ప్రశ్నలు యథాతథంగా పరీక్షలో..

### విచారణ చేపట్టిన రాజస్థాన్ ప్రత్యేక దర్యాప్తు బృందం

### పేపర్ లీక్ ఆరోపణలను కొట్టిపారేసిన ఎన్‌టిఎ

### తెలుగు రాష్ట్రాల నుండి 1.50లక్షల మంది విద్యార్థులు నీట్‌కు హాజరు

**గుంటూరు, మే 11 ప్రభాతవార్త ప్రతినిధి :** అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల ఎంపిక కోసం నిర్వహించే నీట్ పరీక్ష పై మరోసారి నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద పరీక్షగా చెప్పబడుతున్న నీట్ నిర్వహణలో ఎన్ టి ఏ సామర్థం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీట్ 2026 పరీక్ష ప్రశ్నావళిలోని కొన్ని ప్రశ్నలు గెస్ పేపర్ రూపంలో ముందుగానే లీక్ అయ్యాయనే వార్తలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం అయ్యాయి. 2024లో జరిగిన నీట్ పరీక్ష గందరగోళం తర్వాత కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశాయి.అయినా ఇలా ప్రతి సంవత్సరం లీక్ వార్తలు రావడం పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈసారి కూడా కొన్ని కోచింగ్ , పిజి సెంటర్లలో వుండే విద్యార్థులకు కొంతమంది బ్రోకర్ల ద్వారా భారీ మొత్తాలకు ప్రశ్నాపత్రాల్లోని ప్రశ్నలను గెస్ పేపర్ రూపంలో లీక్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వెలుగులోకి వచ్చింది ఇలా..** రాజస్థాన్‌లోని సికార్ ప్రాంతంలో నీట్ పరీక్షకు ముందు కొన్ని పీజీ సెంటర్లలోని విద్యార్థులకు పిడీఎఫ్ రూపంలో సుమారు 80 పేజీల ఒక గెస్ పేపర్ వివిధ సోషల్ మీడియా గ్రూపుల ద్వారా చేరింది.ఈ గెస్ పేపర్ కొంతమంది లైట్ తీసుకోగా మరికొందరు సీరియస్‌గా ప్రిపేర్ అయ్యారు. అయితే మే 3 వ తేదీన పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థులు ప్రశ్నపత్రం సరి చూసుకోగా గెస్ పేపర్‌లో పేర్కొన్న సుమారు 140 ప్రశ్నలు మక్కీకి మక్కీ నీట్ ప్రశ్నపత్రంలో వచ్చినట్లు గుర్తించారు.ఈ విషయాన్ని విద్యార్థులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గెస్ పేపర్ విషయం వెలుగులోకి వచ్చింది.ఈ గెస్ పేపర్ పై దర్యాప్తు చేపట్టిన రాజస్థాన్ స్పెషల్ ఆపరే షన్స్ గ్రూప్‌ప్రాథమిక విచారణలో సుమారు 140 ప్రశ్నలు అసలు పేపర్‌తో ఖచ్చితంగా >>2

# పోలవరం-బనకచర్ల లింక్‌కు అనుమతులివ్వండి

### కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు

### గోదావరి పుష్కరాలలోగా పోలవరం పూర్తికి సహకరించాలని వినతి



సోమవారం న్యూఢిల్లీలో కేంద్రజలశక్తి శాఖమంత్రి సిఆర్‌పాటిల్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 11, ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరుకు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలను మళ్లించేలా ప్రాజెక్టు చేపడుతున్నట్టు వెల్లడించారు. సీఎం చంద్రబాబు సోమవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు.పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ సీఆర్ పాటిల్ కు విజ్ఞప్తి చేసిన సీఎం చంద్రబాబు. 2027 గోదావరి పుష్కరాల లోపు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందించాలని జలశక్తి శాఖను సీఎం చంద్రబాబు కోరారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరిన సీఎం. ఇప్పటికే తాను స్వయంగా 5 మార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించినట్టు వెల్లడించిన ముఖ్యమంత్రి. 2026 ఏప్రిల్ 2 నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2 లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందన్న కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీని వల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్టు సీఎం చంద్రబాబు >>2


జి.నాగేశ్వరరావు(ఫైల్)

## కానిస్టేబుల్ దారుణ హత్య

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,మే 11,ప్రభాతవార్త:** కాకినాడ గాంధీనగర్ రెడ్ క్రాస్ సమీపంలో ఏపీ ఎస్పీ కానిస్టేబుల్ జి.నాగేశ్వరరావు(46) దారుణ హత్యకు గురయ్యారు.ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న దారుణ ఘటనకు జిల్లా కేంద్రంలో కలకలం రేపింది.రెడ్ క్రాస్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నాగేశ్వరరావుపై గుర్తుతెలియని దుండగులు కత్తితో దాడిచేసి పరారయ్యారు. స్థానికులు పోలీసులకు >>2

# వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం


సోమవారం టెక్కలి ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

### టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ప్రతి విభాగాన్ని తనిఖీ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

### మంచినీటి సమస్యపై ఆగ్రహం.. 36 గంటల్లో నివేదిక సమర్పించాలని ఆదేశం

### రోగుల సౌకర్యాలపై బాధ్యతతో వ్యవహరించాలని సిబ్బందికి హెచ్చరిక

**శ్రీకాకుళం/టెక్కలి, మే 11 ప్రభాతవార్త:** జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి అలసత్వం వహించినా సహించేది లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను హెచ్చరించారు. సోమవారం ఉదయం 9 గంటలకే ఆకస్మికంగా టెక్కలి జిల్లా ఆసుపత్రికి చేరుకున్న మంత్రి,సుమారు గంటన్నర పాటు ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీచేశారు. ప్రధానంగా వైద్యులు, సిబ్బంది సమయపాలనపై ఆరా తీసిన ఆయన విధులకు ఆలస్యంగా వచ్చిన 42 మంది సిబ్బందికి మరోసారి పునరావృతం కాకుండా పద్ధతి మార్చుకోవాలని సుతిమెత్తగా హెచ్చరించారు. ఆసుపత్రిలో తాగునీటి సమస్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దీనిపై కమిటీ వేసి 36 గంటల్లోగా నివేదిక సమర్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, రోగులకు ఇబ్బంది కలగకుండా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఆసుపత్రిలో నీటి లభ్యత ఉన్న చోట వెంటనే కొత్త బోరు తవ్వించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించడంతో పాటు, రోగుల రాకపోకల సౌకర్యార్థం ప్రధాన గేటు వద్ద రెండు మాన్యువల్ గేట్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆసు పత్రికి వచ్చే కేసులకు సాధ్యమైనంత వరకు ఇక్కడే చికిత్స అందించాలని, అత్యవసరమైతేనే జిల్లా కేంద్రానికి రిఫర్ చేయాలని వైద్యులకు దిశానిర్దేశం చేశారు. ఓపీ విభాగాన్ని సందర్శించి రోగులతో మాట్లాడిన మంత్రి మరుగుదొడ్ల నిర్వహణ, ఫ్యాన్లు, లైట్లు, లిఫ్ట్ సౌకర్యాలను స్వయం గా పరిశీలించారు. మంత్రి చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ.18 లక్షల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి >>2


సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సిఐసి) సిఇఒ గ్లోరియా పూతో మంత్రి లోకేష్

# సింగపూర్, విశాఖ-కృష్ణపట్నం మధ్య డిజిటల్ వాణిజ్య కారిడార్

### సింగపూర్‌లో సిఐసి సిఇఒతో మంత్రి లోకేష్ చర్చలు

### గుంటూరు మిర్చికి కొత్త మార్కెట్ లభ్యం

**విజయవాడ,మే 11, ప్రభాతవార్తప్రతినిధి:** సింగపూర్, ఏపీలోని విశాఖపట్నం- కృష్ణపట్నం పోర్టు మధ్య ఒక డిజిటల్ వాణిజ్య పైలట్ ప్రాజెక్టుగా కారిడార్ నిర్మించే దిశలో ఆలోచన చేయాలని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ కోరారు.ఏపీ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌కు చేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రణాళికలను కార్యచరణలోని తీసుకుని వస్తోంది. ఈ క్రమంలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. సోమవారం ఆయన సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సీఐసీ) సీఈవో గ్లోరియా పూతో సమావేశమై రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించేందుకు పలు కీలక ప్రతిపాదనలు చేశారు. >>2

# వార్త

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం కొనసాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

## దేశహితమే సమ్మతం!

ఇన్నటివరకు రాజకీయ హితం గురించి మాట్లాడిన ప్రధాని మోడీ ఒక్కసారిగా తన గొంతు సవరించుకొని అభివృద్ధి సంక్షేమాల తాళింపుతో దేశహితోపదేశం చేశారు. అదీ తెలంగాణ గడ్డమీద. పశ్చిమాసియా యుద్ధ సంక్షోభంలో ఇంధన సమకూర్పుకు ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నామో ఏకరువు పెడుతూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోవడమెలాగో హితవు పలికారు. నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా! అంటూనే తెలుగు ప్రజలతో మమేకమై ఎంతో ప్రియాతిప్రియమైన హితవచనాలు వారి చెవికెక్కేలా ప్రసంగాన్ని పండించారు. సంక్షోభం తలెత్తినప్పుడు దేశహితం కోసం పనిచేయడానికి ప్రతీపౌరుడు కట్టుబడి ఉండటం ఈ దేశానికి శ్రేయస్కరమన్న పలుకులు ఆయన నోటంట వినిపించాయి. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రతి భారతీయుడు సంకల్పం చెప్పుకోవాల్సిన అవసరముందని చెప్పగానే జనం జేజేలు పలికారు. ప్రపంచంలో పెట్రోలు ధరలు బాగా పెరిగాయి. వాటి కొనుగోలుపై ఖర్చయ్యే విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలి. ప్రస్తుతానికిది మోడీ మంత్రంగానే పనిచేస్తుంది. దేశంలో వంటనూనె కోసం పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని వ్యయపరుస్తున్నాం. నూనెల వినియోగాన్ని కనీసం పది శాతాన్ని తగ్గిస్తే ఆరోగ్యానికి ఆరోగ్యం, దేశానికి లాభం కలుగుతుంది. మానవాళి సౌభాగ్యం కోసం పండించే 'పంట సిరి'లను కూడా అధిక ఎరువుల వినియోగం ద్వారా వృధా చేయవద్దని ఆయన అభిలాష. కొన్నిటి విషయమై శాస్త్రజ్ఞులు చెబితే ఎంత ఆతృతంగా వింటామో అంతే ఆతృతగా ప్రధాని స్వయంగా చెప్పారంటే వినని, వినిపించుకోని జనం ఉండనే ఉండరు. దేశ సౌభాగ్యానికి ప్రతీక రైతు.అలాంటి రైతు నుంచి ప్రధాని ఆశిస్తున్న అంశాలేవైనా ఉన్నాయంటే అది రసాయనిక ఎరువుల వినియోగం రెట్టింపైపోతుండగా వాటి దిగుమతులకు హెచ్చు వ్యయం జరుగుతోంది. క్షేత్రీయ అవసరాలను నియంత్రించుకుని 25, 30, 40, 45 శాతం తగ్గించుకోవాలి. రసాయనిక ఎరువులు అతిగా వాడితే పంట నాశనమౌతోంది. భూమిని కాపాడుకోవడమూ కష్టమే. అందుకే మితిమీరిన ఎరువుల వినియోగం ఆపాలి. సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారిస్తే మేలు. తద్వారా నేచురల్ ఫామింగ్‌తో భూసారాన్ని వ్యవసాయ క్షేత్రాలను, రక్షించుకోవాలని రైతుల్ని కోరారు. డీజిల్ పంపుల బదులు సోలార్ పంపుల వినియోగంపై దృష్టి పెట్టాలి. ఇంటి ఇల్లాలికి పనిపెట్టారు. విదేశీ దిగుమతులను ఆపడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని తగ్గించుకోవచ్చని ప్రధాని ఉవాచ. ప్రత్యేకించి మహిళలు ఒక ఏడాది పాటు బంగారు కొనుగోళ్లు ఆపేస్తే కూడా మారకద్రవ్యం నిలబడుతుందన్నారు. ఇంధన ఉత్పత్తుల విషయంలో ప్రపంచమంతటా సప్లై చైన్ ఇబ్బందులు ఏర్పడినందున పెట్రోలు, డీజిల్ వినియోగాన్ని కూడా తగ్గించుకోవడంలో సంయమనం పాటించాలి. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో ఆహారం, ఎరువులు, ఇంధనం ధరలు ప్రపంచవ్యాప్తంగా బాగా పెరిగిపోయాయి.కరోనా కారణంగా సరఫరావ్యవస్థలన్నీ చిన్నాభిన్నం అయిపోయాయి. ఇలా ప్రపంచ పరిస్థితుల్ని చెబుతూనే ప్రజల్ని కార్యోన్ముఖుల్ని చేయడం స్వాగతించదగిన విషయం. రాజకీయ ప్రసంగాన్ని ఒక్కసారిగా కట్టడిచేసి తెలంగాణలో అడుగుపెట్టగానే అభివృద్ధి గణాంకాలను వల్లె వేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినట్లు అభివృద్ధి నిధులు కావాలంటే తెలంగాణకు పెద్దగా నిధులు సమకూరవని, గణాంకాలు మార్చుకుని 'డబుల్ ఇంజన్ అభివృద్ధి సాధించడంలో కేంద్రప్రభుత్వానికి సహకరించాలని స్థానిక ప్రభుత్వాన్ని కోరారు. గతంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై సుంకాలు రుద్దగానే ఒక్కసారిగా ప్రధాని 'స్వదేశీ నినాదాన్ని ఎత్తుకున్నారు.స్వదేశీ ఉద్యమం ఈనాటిది కాదు. కొత్తగా వచ్చింది కాకపోయినా స్వావలంబన సిద్ధాంతాన్ని, స్వయం సమృద్ధి ఆవశ్యకతను ఆయన పలికారు. ఇళ్లల్లో వాడే టూత్‌పేస్ట్, బ్రష్, దువ్వెన వంటి నిత్య వినియోగ వస్తువులు కూడా విదేశాల్నించి తెచ్చుకోవడాన్ని ఆయన నిరసించారు.అయితే వీధి గుమ్మం దాటి వంటింట్లోకి చేరిన విదేశీ వస్తు నియంత్రణకు మహిళల సహకారం ఎంతో అవసరమన్నది ప్రధానంగా చాటి చెప్పారు. స్వదేశీ అనగానే దీపావళి దివ్వెలను వాడుతున్నాం కదా! అని సరిపెట్టుకోరాదని ప్రధాని వివరించారు. తాను చెప్పినవన్నీ ప్రతి పౌరుడు, రాజకీయ పార్టీ, ప్రతిసంస్థ పాటించాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరడం విశేషం. భారత దేశాభివృద్ధిలో సంక్షోభాలను జయించడం కూడా ఒక భాగమేనన్నారు.ప్రపంచమార్కెట్‌లో ఎరువుల బస్తా రూ.3వేలు ఉండగా భారత్ కేవలం రూ.300లకే అందించగలుగుతోందని వెల్లడించారు. భారత్‌లో పెద్ద పెద్ద పెట్రోలు బావులు లేనందున దిగుమతులు తప్పడం లేదని, వాటి వలన సామాన్యులపై భారం పడకుండా కేంద్రమే భరిస్తోంది.వీటన్నిటినీ క్రోడీకరించుకుంటే విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా తగ్గిపోతున్నందున వ్యయకర్తనం తప్పదన్నది ఆయన ఆందోళనకు కారణం. ఇంధన వినియోగం తగ్గించే పరిష్కార మార్గంలో సాధ్యమైనంతవరకు రైల్వే సరుకు రవాణాను మాత్రమే వినియోగించాలి. ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని ఆయన సూచిస్తున్నారు. ఓ యేడాదిపాటు విదేశీ పర్యటనలను ఆపేయాలి. భారత్‌లో గల అనేక పర్యాటక ప్రాంతాలను మాత్రమే సందర్శించాలి. భారత్‌ను ఆత్మనిర్భర్ కాకుండా అడ్డుకునే అన్ని అంశాల్లోనూ అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత భారతీయులదేనన్నారు. అటు పార్టీ శ్రేణులను ఎంతగా తట్టిలేపారో, ఇటు సామాన్య ప్రజానీకాన్ని ప్రధాని నరేంద్రమోడీ తన చైతన్యవంత ప్రసంగం ద్వారా స్ఫూర్తి కలిగించారు.

సంకల్పబలం ఉన్నవారు అన్నిటినీ తనకు అనుకూలంగా మలచుకోగలరు. సంకోచించే మనస్సుతో పనిచేసే వాడికి కార్యనాశనం తప్పదు.



సోక్రటీస్

సత్యమనేది మహావృక్షం లాంటిది. దానికి మనం నీళ్లుపోసి పెంచితే అది ఎన్నో పూలు, పండ్లు మనకు ఇస్తుంది.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### ఆచరణలేని ప్రధాని మాటలు

నిన్న హైదరాబాద్‌లో ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రజలు ఖర్చు తగ్గించుకోవాలి అని చెప్పారు.సంతోషం.ఐతే తాము చెప్పేదాన్ని ఎవరైతే ఆచరిస్తారో,వెనుకవారు అనుసరిస్తారు. చెప్పేదొకటి చేసేదొకటిగాఉంటే ఎవరూ నిన్ను అనుసరించరు. ఇది ప్రధానమంత్రి తెలుసుకోవాలి.పటేల్ విగ్రహం మూడువేల కోట్లు పెట్టి నిర్మించడం ఇప్పుడు మన పేద దేశానికి అవసరమా! ప్రధాని నిత్యం ధరించే సూటు ఖరీదు పది పదిహేను లక్షలుంటుంది. ఒక పేద దేశ ప్రధానికి అంత ఖరీదు డ్రెస్ అవసరమా? నెహ్రూ ఎంత సింపుల్‌గా ఉండేవాడు.లాల్‌బహదూర్ శాస్త్రి గారు ఎలాఉండేవాడు?నెలకు 20 రోజులు విదేశాలలో పర్యటిస్తున్నారు.అవసరమా? మనదేశప్రధానులలో ఇంతవరకు ఇన్ని విదేశ ప్రయాణాలు ఎవరూ చెయ్యలేదు. ఇదంతా దుబారాకాదా ఆచరణలేని ప్రకటనలు చెయ్యకూడదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఆప్షనల్ సబ్జెక్ట్‌గా అడ్వర్టైజింగ్

మార్కెటింగ్ వ్యవస్థలో అడ్వర్టైజింగ్ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ప్రతిరోజు ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును వినియోగిస్తూనేఉంటాడు. ప్రతి మానవుడువినియోగదారుడే. కనుక విద్యార్థులకు ఒక ఆప్షనల్ సబ్జెక్టుగాఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అడ్వర్టైజింగ్ సబ్జెక్ట ఉండాలి. పూర్వం డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్ట కలిగినవారికి బోధన రంగంలో అవకాశాలు కల్పించాలి.అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్ట మీద అవగాహన కల్పించాలి 2026-2027 విద్యా సంవత్సరం నుండి ప్రారంభించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### అతివేగం ప్రమాదకరం

రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మితిమీరిన వేగంతో వెళ్తున్న బైకులు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు అన్ని ఏమాత్రం ఆలోచించకుండా అతి వేగంతో వెళ్లడం వలన నిరంతరం ప్రమాదాలు జరుగుతూ ఇంట్లో వాళ్ళని కోల్పోతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఏక్కడికైన వెళ్ళినప్పుడు నిదానంగా నడుపుతూ, ఇంట్లో వాళ్ళ భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఉంటే తప్ప ప్రమాదాలనుకొంత వరకైనా నివారించే అవకాశం ఉంది.వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల గురించి ఆలోచించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### పాఠశాలలు ప్రగతికి నిలయాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలు నేడు అద్భుతమైన ప్రగతికి నిలయాలుగా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన ఒక స్ఫూర్తిదాయక ప్రకటన ఈపాఠశాలలు కేవలం ప్రత్యామ్నాయాలు మాత్రమే కావు, శ్రేష్ఠమైన విద్యా కేంద్రాలని చాటి చెప్పింది.'తల్లిలాలాలన,తండ్రిలారక్షణ,స్నేహితుడిలా బోధన' అనే నినాదం అక్కడి ఆత్మీయవాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. కేవలం వసతుల గురించి మాత్రమే కాకుండా, విద్యార్థుల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఈ ప్రచారం తల్లిదండ్రుల్లో గొప్పనమ్మకాన్ని కలిగిస్తోంది. నాణ్యమైన విద్యను కోరుకుంటూనే ఆర్థిక భారాన్ని మోయలేని కుటుంబాలకు ఇవి సరైన వేదికలుగా మారాయి. ఈ విద్యా విప్లవంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. వారు విద్యార్థుల విద్యావృద్ధిని పర్యవేక్షిస్తూ,వారినిఉన్నత శిఖరాలకు చేరుస్తున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పండ్ల తోటలను పెంచాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరికి బదులుగా వేరే పంటలను ప్రోత్సహించదానికి ప్రయత్నం చెస్తుంది అనే వార్త కొంత ఆశాజనకంగా కనిపిస్తున్నది.ముఖ్యంగా 2014 లో తెలంగాణ లో 68.64 లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తే ఇప్పుడు అది 1.34 కోట్ల ఎకరాలలో సాగు చేస్తున్నారు. అంటే నీటి వసతిపెరగడం ఒకవిషయం అయితే వరిసాగు తేలికగా అయిపోవడం ఒక కారణం. ఇకపోతే తెలంగాణ లాంటి రాష్ట్రంలో చిరు ధాన్యాలు సాగు చేయడానికి అనుకూలంగా వాతావసరణం ఉంటుంది. ముఖ్యంగా పండ్ల సాగు, కురగాయల సాగు కందులు పెసలు,మినుములతో సహా మిగిలిన చిరు ధాన్యాల సాగుకీ చాలా అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఇంకా తెలంగాణకు ఉండే చిన్న నీటి పారదల వ్యవస్థ ఉండడం నెల స్వభావం సహకరించడం వల్ల పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగు ఉపాధి హామీకి వినియోగించాలి.

- భారత అవినాష్ ,జనగామ

### ఇంటర్ కౌన్సెలింగ్ రెమ్యూనేషన్

ఇంటర్మీడియట్ విద్య శాఖపరిధిలోఉన్న అన్నిజూనియర్ కళాశాల లెక్చరర్‌ల కౌన్సిలింగ్ రెమ్యూనేషన్ ఈవిద్యా సంవత్సరం పెంచాలి. రెగ్యులర్ లెక్చరర్ అందరికి డ్యూటీ లు వేయాలి. సరిపోకపోతే పార్ట్‌టైమ్ లెక్చరర్‌లను విని యోగించుకోవాలి.వికాకలాంగుల లెక్చరర్‌లకు తగిన వసతి కలిపించాలి. నగదు రూపంలో ఇంటర్ కౌన్సిలింగ్ రెమ్యూ నిటేషన్ ఇవ్వాలి.ఇంటర్‌కౌన్సిలింగ్‌కోసం స్పెషల్‌గాసర్కులర్‌జి.ఓ తీయాలి..

-రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

## 'విజయ' ఢంకా మోగింది!

**హీరోగా మొదలుపెట్టినవాడు జీరోగా ఎందుకు మారు తాడు అన్న ఆశావాదంతో అతని అభిమానులు ఈలలతో చప్పట్లతో రాబోయే కథను చూడానికి సిద్ధంగా ఉన్నారు. సినిమా హీరోలు రాజకీయాల్లోకి ప్రవేశిస్తే ఆ కథే వేరు అన్నది ఎంజిఆర్, ఎన్‌టిఆర్, హీరోయిన్ జయలలిత నిరూపించగలిగారు. విజయాన్నే పేరులో ధరించిన విజయ్, అపజయాన్ని ఎదుర్కోడన్న నమ్మకంతో అతని ఫాన్స్‌తో బాటు తమిళనాడంతటా సుపరిపాలనతో ప్రజలను ఆకట్టుకోగలడని ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. వారే కాదు దేశమంతటా అదే మాదిరి తమిళనాడును ముఖ్య రంగస్థలంగా భావిస్తూ ఏమవుతుందో అని ఎదురు కాపులు కాస్తున్నది. రాజకీయం, క్రికెట్ ఉత్కంఠ భరితంగానే ఉంటాయి. కానీ చివరి మలుపులో గెలుపుతో దోబూచులాట ఉంటుందని అందరికీ తెలుసు.**



రావులపాటి సీతారాం రావు

తమిళనాడు ఎన్నికలు చరిత్రను తిరగరాసాయి. సినిమా నటుడు విజయ్ విజయం చారిత్రాత్మకంగా మారింది. దానికి కారణం రెండు బలమైన ద్రవిడ పార్టీలను ఎదుర్కోవటమేకాకుండా రెండు జాతీయ పార్టీలు బిజెపి, కాంగ్రెస్‌కు అంతు చిక్కని రీతిలో విజయం సాధించగలిగారు. ఆ విజయం ముఖ్యమంత్రి కుర్చీకి పది సీట్ల దూరంలో ఆగిపోవడం కూడా. మనదేశంలో పాతుకొనిపోయినపార్టీల తీరుతెన్నులను పరిపూర్ణంగా ప్రజలు అర్థం చేసుకోటానికి విధి ఇచ్చిన అవకాశంగా భావించాలేమో! కాలికి వేస్తేమెడకు, మెడకేస్తే కాలికి మెలికలు పెట్టి గవర్నర్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని వాయిదాల మీద వాయిదాలు వేయడం కూడా ఒక విధంగా దేశంలోని ప్రజలందరికీ, నామినేట్ చేయబడ్డ రాజ్యాంగ పదవిలోని వారి పనితనం తెలియచేసినట్లయింది. రామ్‌లాల్ గవర్నర్ గిరీని జ్ఞప్తికి తెచ్చే రీతిలో ఈ ఉదంతం సాగటం ఉత్కంఠను కలిగించింది కానీ ప్రజాస్వామ్యవాదులను తీవ్రంగా నిరుత్సాహపర్చింది.అసామాన్య రీతిలో డబ్బును ఎరజూపకుండా విజయ్ (చాలా ఉచితాలు ప్రకటించడం కూడా ఈ సందర్భంగా విమర్శించవచ్చు) విజయాన్ని దిగ్గజాలను ఢీకొట్టి సాధించడం చరిత్రలో నిలిచిపోతుంది. విజయం తర్వాత తరువాయి భాగం ఏవిధంగా నడుస్తుందో గొప్పగొప్ప రాజకీయ పండితులకూ, విశ్లేషకుల ఊహలకు అందకుండా ఉండటం కూడా విడ్డూరంగానే ఉంది. 2024లో విజయ్ స్థాపించిన టి.వి.కే పార్టీ అనూహ్యంగా రెండు సంవత్సరాలలోనే అధికారాన్ని చేజిక్కించుకోవటం ఇప్పుడు విశేషవార్తగా కొనియాడబడుతుండడంలో ఆశ్చర్యంలేదు. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.ఆర్ తొమ్మిది నెలల్లోనే అనూహ్యంగా రాజ్యాధికారం సంపాదించగలిగారు. ఈ రెండింటికి పోలికలు అనివార్యమని అనుకోవచ్చు. కానీ అప్పటి ఎపి పరిస్థితులువేరు, ఇప్పటి తమిళనాడు పరిస్థితులు వేరు. అప్పుడు ఎపిలో రాజకీయంగా ఖాళీ ఉంది. అంటే కాంగ్రెస్‌తో విసిగిపోయిన ఆంధ్ర ప్రజానీకం మార్పు కోసం అర్రులు చాచిన రోజులవి. ఆధిపత్య ధోరణితో ఢిల్లీ కాంగ్రెస్‌ను దర్బార్ ఇష్టమొచ్చిన రీతిలో ముఖ్యమంత్రులను మార్చి ప్రజల మనోభావాలను పట్టించుకోకపోవడం పతాక స్థాయికి చేరుకున్నప్పుడు ఎన్.టి.ఆర్ రంగప్రవేశం చేసి అప్పటికే నట సార్వభౌముడిగా సినీరంగాన్ని తిరుగులేని రీతిలో ఏలుతుండడంతోపాటు, ప్రచారంలో కొత్తపోకడలతో, చైతన్యరథంతో నవచైతన్యంతోపాటు 'పొగడరా నీ తల్లి భూమి భారతిని అనితెలుగు జాతి గౌరవాన్ని తెలుగు వారి మనోభావాలను దెబ్బతీసిన వైనాన్నినిలువెత్తు అద్దంలోహావభావాలతో డైలాగ్‌లతో చూపిస్తూ కదిలిరా అంటూ నిద్రలో ఉన్న జనాన్ని రాజకీయ రీతిలో మేల్కొల్పగలిగారు. అందువల్లే కాంగ్రెసును ప్రక్కకు నెట్టేసి ఎన్.టి.ఆర్‌కు పట్టకట్టారు. ఇప్పుడు విజయ్ పరిస్థితి రెండు పులులతోనే కాదు, కనపడని మరో అజ్ఞాత వ్యక్తితో పోరాటం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్రవిడ మనోభావాలకు నిలువెత్తు నిదర్శనమైన తమిళజాతిని ప్రాణం పోసిన డియంకే, ఎడియంకెలతోపాటు ఇతర బిజెపి, లెఫ్ట్ పార్టీలను చివరకు కాంగ్రెసును కూడా ఒక్కడంటే ఒక్కడిగా ఓడించి విజయం సాధించడం అపూర్వం. కారణాలు అందరికీ కనపడినవే. నిజాయితీకి, అవినీతిరహిత ఎన్నికలలో పాల్గొన్న విధానానికి విజయ్‌ని నిదర్శనంగా అక్కడి ప్రజలు భావించారు. పెరియార్, కామరాజ్, అంబేద్కర్‌లతో తమిళులకు ఆదర్శులైన మరో ఇద్దరు, నాయకుల వేలు నాచియార్ అంజలాయి అమ్మాల్ విగ్రహాలను ఒక వేదికపై అధిష్టింపచేసి, వారే తనకు ఆదర్శప్రాయులని ఆ స్థలాన్ని సందర్శిస్తూ



ఇన్నేళ్లు తమిళులకు తనేమిటో, తన విధానాలూ, ఆదర్శాలు ఆ విధంగా తెలియచెప్పారు. ప్రచారం మొదటి దశలోనే టి.వి.కె నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాటలో దాదాపు నలభైకిపైగా మృత్యువాతపడినప్పుడు ఆ సందర్భంగా అప్పటి ప్రభుత్వం కేసులే కాకుండా ప్రచారంలో ఆ సంఘటనను అస్త్రంగా మల్చుకున్నప్పుడు వెనుకడుగు వేయకుండా ప్రచార శైలిని మార్చుకొని పెద్దఎత్తున బహిరంగ సభలు నిర్వహించకుండా సోషల్ మీడియా మీద ఆధారపడకుండా, ప్రెస్‌మీట్స్ పెట్టకుండా ఎవరినీ అసభ్యకరంగా విమర్శించకుండా హుందాగా ప్రచారాలను విజయవంతంగా ముగించటం ఓటర్లను ఆకట్టుకుంది. నిజానికి 2009లోనే విజయ్ మక్కల్ ఇయ్యాకం (వి.యం.ఐ) ఒక ఆర్గనైజేషన్ స్థాపించారు.(వి.యం.ఐ) పేరిట 80వేలకుపైగా ఉన్న ఫాన్స్ అసోసియేషన్స్‌తో విజయ్ ఓటర్లలోకి చొచ్చుకొని వెళ్లగలిగాడు. 'స్టాలిన్ అంకుల్' అని హ్యూమర్‌తో డియంకే నాయకుడ్ని తిట్ల పురాణం లేకుండా ఏదైనా ఆ పిలుపుతో సద్విమర్శలకు పూనుకోవటం ఓటర్లకు ప్రచారం వీనులవిందుగా మారింది. అందరికీ కొత్తవారికే పార్టీ టికెట్లు ఇవ్వటం ధైర్యంతో కూడుకున్న పని. చివరకు తన డ్రైవర్ కొడుకును కూడా అభ్యర్థిగా ఎంచుకొని ప్రజల మనోభావాలకు ఆప్యాయతకు మరింత దగ్గరయ్యాడు. ఇవి మచ్చుకు కొన్ని కారణాలు మాత్రమే. అయినా ఇవి చాలవా ఓటర్ల హృదయాలలో స్థానం సంపాదించుకోవటమే కాకుండా పోలింగ్ బూతులకు క్యూలు కట్టడానికి ఆడవారికి ఉచితాలు కొన్ని సహేతుకంగా తోచే రీతిలో ఇస్తానని హామీ ఇవ్వటం తోపాటు విద్యార్థులకు 'మీ మామా మిమ్మల్ని అన్నివిధాలా ఆదుకుంటాడని, మీ పేరంట్స్‌కు చెప్పి నాకు ఓటు వేయమనండి అన్న కొత్త తరహా ప్రచార నిర్వహణ సాగించటం అందర్నీ ఆకట్టుకుంది. చివరకు చిన్నారులను కూడా మీ అమ్మా, నాన్నలకు చెప్పి నాకు ఓటు వేయించండి అని విజ్ఞప్తి చేయడం వారిని కూడా ఉత్సాహంగా విజయ్‌కు చెందిన ప్రచారంలో పాల్గొనేట్లు చేసింది. అన్నిటికంటే మించినది తను హద్దులు మీరకుండా ఇతరులు హద్దు మీరటాన్ని వెలికి తీయటం! వెకిలితనం ఎక్కడా విజయ్‌లో కనపడకపోవడంతో హెచ్చుసంఖ్యలో విజయఢంకా మ్రోగించారు. టి.వి.కె పార్టీ కొత్త రకంగా ఇతర పార్టీలకు భిన్నంగా రాజకీయాలు నడపగలదని ఎన్నికల్లో 108సీట్లతో 35శాతం ఓట్ల షేర్‌తో అందరికంటే మించిన విజయాన్ని తమిళనాడులో సాధించగలిగింది. చివరకు ఎక్కడా ఎవరికీ లొంగకుండా ఓపికతో గవర్నర్ దగ్గర మాటమీరకుండా, ఇతర పార్టీలను ఈ తతంగంలో విమర్శించకుండా పట్టువదలని విక్రమార్కుడు మాదిరి ప్రతిసారీ తనకున్న ఓట్ల బలాన్ని గవర్నర్ అడిగినా అడగకపోయినా వినయంగా ప్రదర్శించటం, అతని రాజనీతిజ్ఞతతోపాటు చతురత, కృత్రిమ ఓటమని ఒప్పుకోకుండా 'జయమ్ము నిశ్చమ్మురా' అన్న ధోరణిలో హీరోలా ప్రవర్తించారు. ప్రజలకు మరింత దగ్గరగా ఆ వైఖరి విజయ్‌ను చేర్చింది. ఇప్పుడు అసలు కథ విజయ్‌కు కానీ, ఇతర పార్టీలకు కానీ కేంద్రానికి కానీ మొదలవుతుంది. ఉత్కంఠ భరితంగా మొదలైన సన్నివేశాలు మరింత ఆసక్తికరంగా ఉంటాయా, విజయ్ వ్యవహారశైలి, ముఖ్యమంత్రిగా ఏ విధంగా ఉండబోతుంది అన్నది, ఈ హీరో విజయాపజయాలను తెరమీద కాదు లైవ్‌లో తమిళనాడే కాదు దేశమంతటా చూడడానికి ఉత్కంఠ భరితంగా ఎదురుచూస్తున్నది. హీరోగా మొదలుపెట్టినవాడు జీరోగా ఎందుకు మారుతాడు అన్న ఆశావాదంతో అతని అభిమానులు ఈలలతో చప్పట్లతో రాబోయే కథను చూడానికి సిద్ధంగా ఉన్నారు. సినిమా హీరోలు రాజకీయాల్లోకి ప్రవేశిస్తే ఆ కథే వేరు అన్నది ఎంజిఆర్, ఎన్‌టిఆర్, హీరోయిన్ జయలలిత నిరూపించగలిగారు. విజయాన్నే పేరులో ధరించిన విజయ్, అపజయాన్ని ఎదుర్కోడన్న నమ్మకంతో అతని ఫాన్స్‌తో బాటు తమిళనాడంతటా సుపరిపాలనతో ప్రజలను ఆకట్టుకోగలడని ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. వారే కాదు దేశమంతటా అదే మాదిరి తమిళనాడును ముఖ్య రంగస్థలంగా భావిస్తూ ఏమవుతుందో అని ఎదురుచూపులు చూస్తున్నది. రాజకీయం, క్రికెట్ ఉత్కంఠ భరితంగానే ఉంటా యి. కానీ చివరి మలుపులో గెలుపుతో దోబూచులాట ఉంటుందని అందరికీ తెలుసు. ●

## రహదారి వ్యవస్థలో సాంకేతిక విప్లవం

తిప్పర్తి శ్రీనివాస్

భారతదేశంలో రహదారి మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో టోల్ వసూళ్ల విధానంలో కూడా సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిణామంలో భాగంగా మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ వ్యవస్థను ప్రవేశపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం అడు గులు వేస్తోంది. ఇది సంప్రదాయ టోల్ ప్లాజాల యుగా నికి ముగింపు పలుకుతూ, వాహనాలు ఆగకుండా ప్రయా ణిస్తూ టోల్ చెల్లించే సరికొత్త విధానంగా భావించబడుతోంది. ఇప్పటి వరకు మనం చూసిన టోల్ ప్లాజాలలో వాహనాలు తప్పనిసరిగా ఆగాలి. ఫాస్టాగ్ వంటి డిజిటల్ చెల్లింపు విధానం వచ్చినప్పటికీ, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయాల్లో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడటం సహజం. ఇది ఇంధన వ్యర్థాన్ని, సమ య నష్టాన్ని మాత్రమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా పెంచుతుంది. ఈ సమస్యలకు పరిష్కారంగా ఎం ఎల్ ఎఫ్ ఎఫ్ వ్యవస్థను తీసుకురావడం సముచితమైన చర్యగా కనిపిస్తుంది. ఎం ఎల్ ఎఫ్ ఎఫ్ విధానంలోటోల్ ప్లాజాలు ఉండవు. వాటి స్థానంలో హైవే పై గ్యాంట్రీలు (గేట్లు వంటి నిర్మాణాలు) ఏర్పాటు చేస్తారు. ఈ గ్యాంట్రీ లపై ఉన్న సెన్సర్లు, కెమెరాలు వాహన నంబర్ ప్లేట్లను చదివి, సంబంధిత బ్యాంక్ ఖాతా లేదా డిజిటల్ వాలెట్ నుండి టోల్ మొత్తాన్ని ఆటోమేటిక్‌గా డెబిట్ చేస్తాయి. అంటే వాహనం ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా నిరంతరంగా ప్రయాణం కొనసాగుతుంది. ఈ విధానం వల్ల ప్రయాణికులకు అనేక ప్రయోజనాలున్నాయి. మొదటగా, సమయం ఆదాఅవుతుంది. ముఖ్యంగా దీర్ఘదూరప్రయాణాల్లో టోల్‌ప్లాజాల వద్ద వృథా అయ్యే సమయం గణనీయంగా తగ్గుతుంది. రెండవది, ఇంధన వినియోగం తగ్గుతుంది. వాహనాలు ఆగి మళ్లీ స్టార్ట్ అయ్యే అవసరం లేక పోవడం తో ఇంధన పొదుపు సాధ్యమవు తుంది. మూడవది కాలుష్యం



తగ్గుతుంది. ట్రాఫిక్ నిలిచిపోవడం తగ్గడం వల్ల కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గుతాయి. అయితే, ఈ కొత్త వ్యవస్థపై కొన్ని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా గోప్యత అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది. వాహనాల కదలికలను నిరంతరం ట్రాక్ చేసే అవకాశం ఉండటంతో, వ్యక్తిగత డేటా భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈడేటా ఎక్కడ నిల్వఅవు తుంది? దాన్ని ఎవరు ఉపయోగిస్తారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలుఅవసరం. ఇంకా ఒక సమస్య - సాంకేతిక లోపాలు. కెమెరాలు తప్పుగా నంబర్ ప్లేట్లుచదివితే? లేదా ఖాతాలో సరిపడా డబ్బు లేకపోతే? ఇలాంటి సందర్భాల్లో వాహనదారులు అన్యాయంగా జరిమానాలు చెల్లించాల్సి రావచ్చు. అందుకే ఈ వ్యవస్థను అమలుచేసే ముందు పటిష్టమైన సాంకేతిక మౌలిక వసతులు, పారద ర్శకమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో లేదా సాంకేతిక అవగాహన తక్కువగా ఉన్న వాహనదారుల విషయంలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందరికీ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు అందు బాటులో ఉండకపోవచ్చు. ఈనేపథ్యంలో ప్రభుత్వం అవ గాహన కార్యక్రమాలు చేపట్టి, అవసరమైన సహాయాన్ని అందించాలి. మరోవైపు, ఈ వ్యవస్థద్వారా ప్రభుత్వానికి ఆదాయం పారదర్శకంగా, సమర్థవంతంగా వసూలు కావ చ్చు. టోల్ ఎగవేత తగ్గే అవకాశం ఉంది. దీంతో రహ దారి అభివృద్ధికి మరింత నిధులు సమకూరుతాయి. సారాంశంగా చెప్పాలంటే, మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ వ్యవస్థ రహదారి ప్రయాణం లో ఒక సాంకేతిక విప్లవం. ఇది సమయం, ఇంధనం, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించగలదు. అయితే, దీనిని అమలు చేసేక్రమంలో గోప్యత,సాంకేతిక లోపాలు, ప్రజల అవగాహన వంటి అంశాలను సమగ్రంగాపరిష్కరించాల్సిన అవసరం ఉంది. సరైన ప్రణాళిక, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం ఉంటే,ఈకొత్త విధానం భారతదేశ రహదారి వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చగలదు. ●

## బెంగాల్ మార్పు దేశానికి దిక్సూచి!

సొప్పరి నరేందర్

భారతదేశ చరిత్రలో బెంగాల్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. బెంగాల్ రాజకీయాలకు దేశ రాజకీయ గతిని మార్చేశక్తిగా ఉంటుంది. మమత బెనర్జీ తృణమూల్‌కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ బిజెపి బలంగా పుంజుకోవడం రాష్ట్రంలో అధికారం కోసం జరుగుతున్న హోరాహోరీ పోరు దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ ఆకాంక్షలను ప్రభావితం చేయనుంది. అక్రమ వలసలు జాతీయ పౌరసత్వ అంశాలు బెంగాల్‌లో ప్రధాన ఎన్నికల అంశాలుగా మారాయి. బెంగాల్ ఫలితాలు కేంద్రం తీసుకునే కఠినమైన సరిహద్దు భద్రతా నిర్ణయాలకు పౌరసత్వ బిల్లుల అమలుకు బలమైన సంకేతాన్ని ఇస్తాయి. రాజకీయ విశ్లేషణల ప్రకారం మైనారిటీ ఓట్ల ఏకీకరణ హిందూ ఓట్ల ధ్రువీకరణ బెంగాల్‌లో కొత్త రకమైన రాజకీయ సమీకరణాలకు దారితీస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటం నుంచి సాహిత్యం, సంస్కృతి, రాజకీయాలు, విద్య, ఆర్థిక రంగాల వరకు ప్రతి విభాగంలో బెంగాల్ దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. నేడు బెంగాల్ ఆలోచించేదే రేపు భారత్ ఆలోచిస్తుంది అనే నానుడి యాదృచ్ఛికంగా రాలేదు. కాలానుగుణంగా మార్పులను స్వీకరించి దేశానికి దిక్సూచిగా నిలవడం బెంగాల్ ప్రత్యేకత. నేటి పరిస్థితుల్లో కూడా బెంగాల్‌లో జరుగుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. బెంగాల్ మార్పు గురించి మాట్లాడితే ముందుగా విద్యా, సాంస్కృతిక రంగాలను ప్రస్తావించాలి. రాజారామమోహన్ రాయ్, ఇశ్వర్ చంద్ర విద్యాసాగర్, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయులు సామాజిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. బాల్యవివాహాల నిర్మూలన, మహిళా విద్య, ఆధునిక విద్యా వ్యవస్థ వంటి అంశాల్లో బెంగాల్ ముందడుగు వేసింది. ఆ మార్పులు క్రమంగా దేశమంతటా వ్యాపించాయి.నేటికీ విద్య,సాహిత్యం, కళల విషయంలో బెంగాల్ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తోంది. రాజకీయ పరంగా కూడా బెంగాల్ ఎప్పుడూ దేశ దృష్టిని ఆకర్షించింది. స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ వంటి నేతలు జాతీయ భావజాలాన్ని బలపరి చారు. అనంతరం వామపక్ష రాజకీయాల కేంద్రంగాబెంగాల్ నిలిచి భూసంస్కరణలు, గ్రామీణ అభివృద్ధి వంటి అంశాల్లో దేశానికి కొత్త నమూనాలను చూపించింది. తరువాత రాజకీయ మార్పులతో ప్రాంతీయ పార్టీల ఎదుగుదల చోటుచేసు



కుంది. ఇది భారతదేశంలో ప్రాంతీయ రాజకీయాల ప్రాధాన్యాన్ని మరింత స్పష్టంగా చేసింది. ఆర్థిక రంగంలో కూడా బెంగాల్ మార్పు గమనించదగ్గది. ఒకప్పుడు జూట్ పరిశ్రమలు, నౌకాశ్రయాలు, వ్యాపార కేంద్రాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన అండగా ఉన్న బెంగాల్, కొన్ని దశాబ్దాల్లో పరిశ్రమల క్షీణతను ఎదుర్కొంది.అయితే ఇటీవల ఐటీ, సేవా రంగం, స్టార్టప్‌ల అభివృద్ధి ద్వారా కొత్త అవకాశాల వైపు అడుగులు వేస్తోంది. కోల్‌కత్తా వంటి నగరాలు మళ్లీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మార్పు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఒక పాఠంలా నిలుస్తోంది. కాలానికి అనుగుణంగా మారితేనే అభివృద్ధి సాధ్యమని సూచిస్తోంది.సామాజిక రంగంలో బెంగాల్ ఎప్పుడూ చైతన్యానికి కేంద్రబిందువుగా నిలిచింది. సాహిత్యం, సినిమా, నాటకరంగం ద్వారా ప్రజల్లో సామాజిక అవగాహన పెంచడం బెంగాల్ ప్రత్యేకత. సత్యజిత్ రే సినిమాలు, బెంగాలీ సాహిత్యం దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయి. మేధావుల చర్చలు, ప్రజాస్వామ్య భావజాలం, రాజకీయ చైతన్యం అక్కడి సమాజాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రజలలో ప్రశ్నించే ధోరణి ఎక్కువగా ఉండటం కూడా బెంగాల్ ప్రత్యేకతగా చెప్పవచ్చు. అయితే బెంగాల్ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా విస్మరించలేం. నిరుద్యోగం, రాజకీయ హింస, వలసలు, పరిశ్రమల కొరత వంటి సమస్యలు రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులుగా మారుతున్నాయి. అయినప్పటికీ బెంగాల్ ప్రజలలో ఉన్న సృజనాత్మకత, చైతన్యం, మార్పును స్వీకరించే స్వభావం ఈ సమస్యలను అధిగమించే శక్తిని ఇస్తోంది. అందుకే బెంగాల్ మార్పు దేశానికి దిక్సూచిగా భావించబడుతోంది. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో కూడా బెంగాల్ కీలక పాత్ర పోషిస్తోంది. జాతీయ పార్టీలకు బెంగాల్ ఒక రాజకీయ పరీక్షా స్థలంగా మారింది. అక్కడి ఎన్నికల ఫలితాలు దేశరాజకీయ ధోరణులపై ప్రభావం చూపుతున్నాయి. సామాజిక సమీకరణాలు, మైనారిటీ రాజకీయాలు, సంక్షేమ పథకాల ప్రభావం వంటి అంశాల్లో బెంగాల్ ఒక ప్రయోగశాలగా కనిపిస్తోంది. ఈ మార్పులను గమనిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. మొత్తానికి బెంగాల్ భారతదేశ ఆలోచనా విధానానికి ప్రతిబింబం. విద్యలో, సంస్కృతిలో, రాజకీయాల్లో, సామాజిక చైతన్యంలో జరిగిన ప్రతి మార్పు దేశవ్యాప్తంగా ప్రభావం చూపింది. నేటి మారుతున్న భారతదేశంలో బెంగాల్ మరోసారి కొత్త దిశను చూపించే స్థితిలో ఉంది.అభివృద్ధి,ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం కలగలిపిన మార్గాన్ని చూపగలిగితే బెంగాల్ నిజంగా దేశా నికి దిక్సూచిగా నిలుస్తుంది. 2026 మే నెలలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయం సాధించి రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. బిజెపి బెంగాల్ లో తొలి సర్కార్‌తో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చింది. ●

# సంప్రదాయబద్ధంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్

## కలశ యాత్రలో 1000 మంది భక్తులు శివపంచాక్షరీ నామలేఖన యజ్ఞం



**శ్రీశైలం ప్రాజెక్ట్ మే 11,ప్రభాతవార్త :** శ్రీశైల దేవస్థానంలో ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు దేవస్థానంలో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించబడింది. దేవస్థానం ఈవో యం. శ్రీనివాసరావు, ధర్మకర్తలమండలి ప్రత్యేక ఆహ్వానితులు, అర్చకస్వాములు, వేదపండితులు, పలువురు దేవస్థానం అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో భాగంగా ఉదయం ఆలయప్రాంగణములోని అక్కమహాదేవి అలంకారమండపంలో సహస్రకలశారాధన కార్యక్రమం నిర్వహించబడింది. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. తరువాత సహస్రకలశారాధన కార్యక్రమం జరిగింది. గంగానది పుణ్యనదీజలాలను కలశంలోకి ఆహ్వానిస్తూ కలశారాధన నిర్వహించబడింది. కలశారాధన తరువాత పుణ్యజల కలశాలను భక్తులకు అందజేయబడ్డాయి. భక్తులందరు కూడా భక్తిశ్రద్ధలతో కలశాలను తలపై ధరించి కలశయాత్రలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం నుంచి గంగాధర మండపం వరకు, అక్కడి నుంచి నందిగుడి నుంచి మల్లికార్జునసదన్ మీదుగా క్షేత్రపాలకుడైన బయలువీరభద్రస్వామి ఆలయం వరకు ఈ కలశయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బయలువీరభద్రస్వామివారికి విశేషపూజాదికాలు, ఆలయం నుంచి గంగాధర మండపం మీదుగా ఆలయప్రాంగణం వరకు కలశయాత్ర కొనసాగించబడింది. కలశయాత్ర అనంతరం శ్రీవృద్ధమల్లికార్జునస్వామివారికి శాస్త్రోక్తంగా కలశాభిషేకం జరిపించబడింది. ఈ కలశయాత్రలో సుమారు 1000 మంది భక్తులు పాల్గొన్నారు. కలశయాత్రలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీస్వామి వారి అలంకార దర్శనం, అమ్మవార్ల దర్శనం కల్పించబడింది. కలశయాత్ర తరువాత శివపంచాక్షరీ నామలేఖన యజ్ఞకార్యక్రమం ప్రారంభించబడింది. అనంతరం భక్తులందరు కూడా శివపంచాక్షరీ మంత్రాన్ని వ్రాయడం జరిగింది. ఈ శివపంచాక్షరి పుస్తకాలను శ్రీస్వామిఅమ్మవార్లకు సమర్పించడం జరుగుతుంది. ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు : సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమంలో భాగంగానే ఈ సాయంకాలం గంగాధర మండపం వద్ద ఏర్పాటు చేయబడిన ప్రత్యేక వేదిక వద్ద పలు ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. కాగా ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ సోమనాథ ఆలయంపై దాడి జరిగి 1000 సంవత్సరాలు మరియు ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాల సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతికశాఖ దేశవ్యాప్తంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరున పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఇందులో భాగంగా దేవదాయశాఖ ఉత్తర్వుల మేరకు సోమవారం నాడు దేవస్థానం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన ఇంజనీరింగ్ విద్యార్థి అరెస్టు

### - రూ.8.10 లక్షల విలువైన 30 ప్రింటర్లు, 3 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**చిత్తూరు, మే 11 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ విద్య అభ్యసించే విద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిస అయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పెట్టడం కోసం సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. మూడు జిల్లాల పరిధిలోని పలు గ్రామ సచివాలయాల్లో దొంగతనాలకు పాల్పడి అక్కడ వున్న ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర కంప్యూటర్ పరికరాలను దొంగలించుకుని తక్కువ ధరలకు అమ్మి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడేవాడు. ప్రస్తుతం తిరుపతిలో నివాసం వున్న ఎస్ఆర్ పురం మండలం కన్నికాపురం గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మహేష్‌బాబు(22)ను సోమవారం పోలీసులు అరెస్టు చేసి అతని నుండి రూ.8.10 లక్షల విలువైన 30 ప్రింటర్లు, 3 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఎస్పీ తుషార్ డూడి విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుడు మహేష్‌బాబును అరెస్టు చేసి అతని నుండి స్వాధీనం చేసుకున్న ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లను ప్రదర్శిస్తూ వెల్లడించిన వివరాల మేరకు మహేష్‌బాబుపై చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 18 కేసులు వున్నాయన్నారు. సోమవారం నగరి డీఎస్పీ జె.రామ్‌బాబు పర్యవేక్షణలో కార్వేటినగరం ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్, సిబ్బంది ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్తూరు-తిరుపతి ప్రధాన రహదారిలో మఠం క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వున్న మహేష్‌బాబును అరెస్టు చేశారన్నారు. మహేష్‌బాబు వద్ద ఒక ప్రింటర్ వుండటంతో అనుమానంతో అరెస్టు చేసి ప్రశ్నిస్తే పలు గ్రామ, వార్డు సచివాలయాల్లో పెద్ద ఎత్తున ప్రింటర్లు దొంగతనం చేశానని అంగీకరించడం జరిగిందన్నారు. పోలీసులు అతని నుండి వివిధ గ్రామ సచివాలయాల్లో దొంగతనానికి గురైన 30 ప్రింటర్లు, ఒక ద్విచక్ర వాహనంను స్వాధీనం చేసుకున్నారన్నారు. పోలీసుల విచారణలో మహేష్‌బాబు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో పలు గ్రామ సచివాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. కట్టర్ సహాయంతో గ్రామ సచివాలయాల తలుపులు పగులగొట్టి ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు దొంగలించేవాడని, ఇలా దొంగలించిన వస్తువులను అమ్మగా వచ్చిన డబ్బులను ఆన్‌లైన్ బెట్టింగ్, విలాసవంతమైన జీవితానికి ఖర్చు చేసేవాడన్నాడు. మహేష్‌బాబు దొంగలించిన ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లను ఓఎల్ఎక్స్ యాప్‌లో సెకండ్ హ్యాండ్ వస్తువులుగా అప్‌లోడ్ చేసి తక్కువ ధరలకు విక్రయించేవాడన్నారు.

## మానవత్వం చాటుకున్న మంత్రి నారాయణ

### - అగ్ని ప్రమాద బాధితులకు ఇంటి మరమ్మతు చేయిస్తానని భరోసా

**నెల్లూరు, మే 11, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని 52వ డివిజన్ రైలు వీధిలో అగ్ని ప్రమాదానికి గురైన టీడీపీ మహిళా కార్యకర్త షేక్ జరినా కుటుంబాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరామర్శించారు. ప్రమాదంలో కాలిపోయిన ఇంటిని, నష్టపోయిన గృహోపకరణాలను పరిశీలించిన మంత్రి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. మంత్రి చొరువతో ఎన్‌సీసీ గ్రూపు ఆ ఇంటి మరమ్మత్తు బాధ్యతలను స్వీకరించింది. కేవలం వారం రోజుల్లోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. తక్షణ ఉపశమనం కింద మంత్రి తన వంతుగా రూ.20వేలు ఆర్థిక సాయం అందించగా, ఆయన స్ఫూర్తితో స్థానిక టీడీపీ నేతలు మరో రూ.15వేలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గతంలో ఇళ్లు కోల్పోయిన వారికి నెలరోజుల్లోనే పనర్నిర్మించి ఇచ్చామని, నగర అభివృద్ధికి ప్రభుత్వంపై భారం పడకుండా తన స్నేహితులు, పూర్వ విద్యార్థుల సహకారంతో సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తున్నామని తెలిపారు. గ్రీన్ సిటీ ప్రాజెక్టును కూడా ప్రభుత్వ నిధులు లేకుండానే విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల్లో చెప్పిన దానికంటే ఎక్కువే చేసి చూపిస్తామన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ మహిళా నేత షేక్ జరినా ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైన ఘటనలో మంత్రి నారాయణ సార్ చూపిన ఉదారత అభినందనీయమని కొనియాడారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి : జనసేన నేతలు మాజీ మంత్రి బాలినేని, ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు పిలుపు

**ఒంగోలు, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని జనసేన రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని బాలాజీ తిరుపతిరావు కళ్యాణ మండపంలో స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా, ఉమ్మడి నెల్లూరు జిల్లాల పీవోసీలు, ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీలిమిటేషన్ కమిటీ సభ్యులైన బాలినేని శ్రీనివాసరెడ్డి, అరణి శ్రీనివాసులు ఈ సమావేశంలో మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో జరుగుతున్న వార్డులు, డివిజన్, పునర్విభజనపై చర్చించారు. జనసేన బలంగా ఉండే వార్డులు, డివిజన్లు గుర్తించాలని వాటిలో ఏమైనా మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే వాటి వివరాలను కమిటీకి అందించాలని బాలినేని కోరారు. పునర్విభజనపై పూర్తి వివరాలను ఆయా ప్రాంత నాయకులు 13వ తేదీలోపు కమిటీకి పంపాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ ప్రకటన విలువడిన నాడే జనసేన పోటీ చేసే స్థానాలను ప్రకటించేలా అధిష్టానం నిర్ణయం తీసుకుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నివేదిక సమర్పణపై ఇచ్చిన సమయం తక్కువగా ఉందని, పొడిగింపు విషయం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అర్బన్ ప్రాంతాల పైన మాత్రమే కసరత్తు చేస్తున్నామని, త్వరలో నియోజకవర్గాల వారీగా మండలాల్లో పర్యటించి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో జనసేన ఎక్కడ బలంగా ఉంది, ఎవరు పోటీ చేయాలన్న అంశాలతో నివేదిక సిద్ధం చేసి అధిష్టానానికి అందిస్తామని బాలినేని చెప్పారు. కొత్త వార్డులు, డివిజన్లలో జనసేన ఖచ్చితంగా గెలిచే స్థానాలను గుర్తించడంతో పాటు సరైన అభ్యర్థులను సూచిస్తే బాగుంటుందని అరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి పవన్ కళ్యాణ్ న్యాయం చేస్తారని బాలినేని తెలిపారు. తాను వైసీపీలో ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్ అందరిని తిట్టారని, కానీ బాలినేని వంటి మంచోళ్లు ఉన్నారని, తన గురించి చాలా గొప్పగా చెప్పారన్నారు బాలినేని. గతంలో తాను మంత్రి పదవి వదులుకుని జగన్ కోసం ఎంతో కష్టపడి పని చేశానని, డబ్బులు కూడా ఖర్చు చాలా పెట్టానన్నారు. జగన్ ఎప్పుడు తన గురించి పబ్లిక్ మీటింగ్‌లలో మాట్లాడలేదన్నారు. ప్రశ్నించే పార్టీలో ఉంటే బాగుండేది అనుకునే వాణ్ని, జగన్‌ను ఎప్పుడు ప్రశ్నించేవాడిని, అందుకే తన మంత్రి పదవి పోయిందన్నారు. తప్పు జరిగితే చెప్పేవాడినని, ఎన్ని సమస్యలు వచ్చినా తట్టుకున్నానన్నారు. తాను ఒంగోలులో ఏడు సార్లు పోటీచేసి ఐదు సార్లు గెలిచానని, రెండు సార్లు ఓడిపోయానన్నారు. ఆ రెండు సార్లు తెలుగుదేశం పార్టీ కాదు, పవన్ కళ్యాణ్ ఓడించారన్నారు. తెలుగుదేశం వాళ్లు తనను సొంతంగా ఓడించలేకపోయారన్నారు. నీవల్లే ఓడిపోయానని పవన్‌కళ్యాణ్‌కు చెప్పానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన బలంగా ఉన్న చోట పోటీ చేయాలని పవన్ కళ్యాణ్ చెప్పినట్లు బాలినేని తెలిపారు. నియోజకవర్గాల్లో జనసేనలో గ్రూపులు ఉంటే కూటమి ఎమ్మెల్యేలతో ఇబ్బందులు వస్తాయని, అందుకైనా జనసేన పార్టీలో గ్రూపులు పక్కన పెట్టాలని ఆయన కోరారు.

## సంగం బ్యారేజి వద్ద కావలి కెనాల్‌కి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి

**సంగం (నెల్లూరు), మే 11, ప్రభాతవార్త :** సంగం బ్యారేజి నుండి కావలి కాలువకు కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే దుగ్గుమాటి కృష్ణారెడ్డికి నాయకులు ఘన స్వాగతం పలికారు. కావలి కెనాల్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. ఐఎబి తీర్మానం ప్రకారం కావలి కాలువ ఆయకట్టు కింద ఉండే 78 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత వరుణ దేవుడు సైతం కరుణిస్తున్నాడని కొనియాడారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో రెండో సారి రెండోకారుకి సాగునీరు అందిస్తున్నానన్నారు.

## సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత

### : జలవనరుల మంత్రి నిమ్మల

**విజయవాడ,మే 11, ప్రభాత వార్తప్రతినిధి:** సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి నిమ్మల అన్నారు. కరవు రహితంగా మార్చే ప్రాజెక్టు పోలవరమని నిమ్మల నాయుడు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు అని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తికానుందని నిమ్మల తేల్చిచెప్పారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పోలవరాన్ని ప్రశ్నార్థకంగా చేసిందన్నారు. ప్రధాని చేతుల మీదుగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వివరించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చిందని తెలియజేశారు. తుంగభద్ర గేట్లు ప్రమాదభరితంగా ఉంటే వైఎస్సార్సీపీ ప్రభుత్వం పట్టించు కోలేదని ఆరోపించారు. తుంగభద్రకు సంబంధించిన మొత్తం గేట్లు కొత్తవి నిర్మిస్తున్నామన్నారు. భూమిని కూడా జలాశయంగా మార్చుకుని భూగర్భ జలాలను పెంచాలనేది లక్ష్యమన్నారు. గోదావరికావేరి నదుల అనుసంధానంపై యాక్షన్ ప్లాన్ తయారీపై చర్చించారు. రికార్డు సమయంలో కొత్త దయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తిచేశామని ఈ సందర్భంగా మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

## తిరుపతిలో రూ.6లక్షలు విలువైన మొబైల్‌ఫోన్‌లు స్వాధీనం

### - నేపాల్ నిందితుడు అరెస్ట్



**తిరుపతి,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో కూలీగా నటిస్తూ పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నేపాల్ దేశానికి చెందిన నిందితుడ్ని తిరుపతి జిల్లా క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్దనుండి 6లక్షల రూపాయలు విలువైన మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు క్రైమ్ విభాగం అదనపు ఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో తిరుపతి క్రైమ్ విభాగం పోలీసులు నగరంలో వరుసగా జరుగుతున్న మొబైల్ ఫోన్ చోరీ కేసులపై నిఘా ఉంచారు. ఈ దర్యాప్తులో తిరుపతిలో కూలీగా ఉంటున్న నేపాల్ దేశస్థుడు మహేష్ బహదూర్ జటారా అనే సంతోష్ తాపా అనే దాజా మహేష్ కుమార్ (29) పట్టుబడ్డాడు. ఇతడు గతంలో కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండి జైలు శిక్ష కూడా అనుభవించినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు తిరుపతిలో కూలీ పనులు చేస్తున్నట్లు నటిస్తూ, పెద్ద మార్కెట్లు సంచరించే ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పెద్ద షాపింగ్ మాల్స్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాడు. గత జనవరి, ఏప్రిల్ నెలల్లో రామానుజ కూడలి సమీపంలోని రిలయన్స్ మార్ట్ గోడ దూకి లోపలికి ప్రవేశించి ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులను అపహరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్ ,టిటిడి సత్రాల పరిసర ప్రాంతాల్లో కూడా పలు చోరీలకు పాల్పడినట్లు బయటపడింది. నిందితుడి వద్ద నుండి సుమారు ఆరులక్షలు రూపాయలు విలువైన 08 ఖరీదైన స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన సి.సి.ఎస్ డిఎస్పీ వై.శ్యామ్‌సుందర్, సిఐలను ,సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## మర్రిపాడు మండలం చివరి భూమి వరకు నీరు ఇవ్వడమే లక్ష్యం

## దేవాదాయ మంత్రి ఆనం



**మర్రిపాడు (నెల్లూరు), మే 11, ప్రభాతవార్త :** మర్రిపాడు మండలం పల్లవోలు గ్రామంలో సోమవారం శ్రీ సీతారాముల స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ల్లవోలు పంచాయతీలో 25 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లును ప్రారంభించారు. హైలెవల్ కెనాల్ రూపకల్పన జరుగుతోందని దానిన తమ ప్రభుత్వమే పూర్తి చేస్తుందన్నారు. గత పదేళ్ళలో మర్రిపాడు మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు పదిరూపాయలు కూడా హైలెవల్‌కెనాల్‌కోసం ఖర్చు చేయలేదన్నారు. పదేళ్ళ క్రితం తాను ఎలా ప్రారంభించానో ఇప్పటికీ అలాగే ఉందన్నారు. మళ్ళీ ఇప్పుడు తన హయాంలోనే పనులు మొదలయ్యాయన్నారు. భూసేకరణ పనులు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. రెండేళ్ళలో హైలెవల్ కెనాల్ పూర్తి చేసి మర్రిపాడు మండలానికి సాగునీరు, తాగునీరు అందించడమే సంకల్పంగా పనిచేస్తున్నా మన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుకుంటూ ఒక స్పష్టమైన విధానంతో తమ ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. పల్లవోలు గ్రామంలో శ్రీ సీతారాముల ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడం మహాభాగ్యమన్నారు. ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ధూపదీప నైవేథ్యం స్కీం ద్వారా ఈ ఆలయానికి ప్రతినెల 10వేల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. హిందూధర్మం, సనాతన ఆచార వ్యవహారాలను ఆలయ మర్యాదలను కాపాడుతూ ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ కోసం సిఎం చంరదబాబు నాయుడు ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ పనిచేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలను తమ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుదన్నారు. పెద్ద ఎత్తున సామాజిక పెన్షన్లు పంపిణీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం వంటి ప్రధాన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలో సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు అండగా నిలిచేందుకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. మర్రిపాడు మండలంలో 144 కుటుంబాలకు 1.30కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సహాయం అందజేశామన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆకాశయానం

### ఉపాధ్యాయుడి వినూత్న ప్రోత్సాహం - అభినందించిన కలెక్టర్ రాంసుందర్ రెడ్డి



**విజయనగరంమెరకముడిదాం, మే 11 ప్రభాతవార్త** సాధారణంగా పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం లేదా దాతలు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయడం చూస్తుంటాం. కానీ విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గోపన్నవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎం.సత్యారావు విద్యార్థుల్లో మరింత స్ఫూర్తిని నింపేందుకు సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను ఆయన తన సొంత ఖర్చులతో విమాన ప్రయాణం చేయించి వారి కలలను నిజం చేశారు. ఈ వినూత్న పురస్కారానికి ఎంపికైన వారిలో మెరకముడిదాం కేజీబీవీ పాఠశాలకు చెందిన మంత్రి విజయలక్ష్మి (590 మార్కులు), గుర్ల మండలం వల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సంచాన దినేష్ (590 మార్కులు), గరివిడి మండలం కోనూరు పాఠశాలకు చెందిన నామాల లిఖిత (589 మార్కులు), మెరకముడిదాం మండలం గర్భం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మంత్రి ప్రియవర్షిణి (585 మార్కులు) మరియు చీపురుపల్లి మండలం పెదనడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఇప్పిలి శేఖర్ (583 మార్కులు) ఉన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఈ విద్యార్థులు విమానం ఎక్కడం తమ జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని ఆనందం వ్యక్తం చేశారు.

## కన్నుల పండువగా సోమనాధ శోభా యాత్ర

**శ్రీకాళహస్తి,మే 11 ప్రభాతవార్త** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో సోమనాధ శోభా యాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశులు పర్యవేక్షణలో సాగిన యాత్రకు పట్టణంలోని నాలుగుమాడావీదుల్లో పండగ వాతావరణం సృష్టించారు. నాలుగుమాడావీధుల్లో సర్వాంగ సుందరంగా అరటి చెట్లతో ముస్తాబు చేసారు. కాషాయ జెండాలతో రెప రెప లాడించారు. ఉదయం ప్రభుత్వ పిలుపు మేరకు అలంకార మండపం వద్ద కళాకారులను సమీకరించారు. ముందు శరీరాన్ని గగుర్పాటు కల్పించే కేరళ వాయిద్యాలతో తరువాత సంప్రదాయ మంగళవాయిద్యాలతో 'సోమనాధుని చిత్ర పటాన్ని' సప్పరంలో ప్రతిష్టించారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ముందు సంప్రదాయ కోలాటాల నృత్యాలతో కాషాయం జెండాలతో పాటు ఓం కార నాదంతోకూడిన కాషాయ జెండాలతో శోభాయాత్ర సాగింది, ఈ యాత్రలో ఆలయ ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు గుర్రప్పశెట్టిలు కోలాటాలాడటం ప్రజల్ని ఆకట్టుకుంది. ముందు ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశులు, డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, వేదపండితులు, ధర్మకర్తల మండలి సభ్యుడు ఉన్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమలలో ప్రత్యేక తనిఖీలు



**తిరుమల,మే 11ప్రభాత వార్తప్రతినిధి:** వేసవి సెలవులు ఆపై భక్తుల తాకిడి అదికంగా ఉండటంతో తిరుమలలో ప్రశాంతవాతావరణం నెలకొల్పడానికి తిరుమల పోలీసులు చర్యలు తీసుకుంటు న్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ పర్యవేక్షణలో తిరుమల 2టౌన్ పోలీసులు సోమవారం నందకం గెస్ట్ హౌస్ పరిసర ప్రాంతాల్లో విస్తృత స్థాయి స్పెషల్ డ్రైవ్ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, సంచులపై క్షుణ్ణ తనిఖీలు చేయడంతో భక్తులకు కొంత అసౌకర్యం కలిగింది. తిరుమలలో భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల అప్రమత్త చర్యలు తీసుకుంటున్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వారి వివరాలు పరిశీలించడంతో పాటు, వాహనాలు, సంచులు మరియు ఇతర వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తిరుమలలో ప్రతిరోజూ అధిక సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణకు ,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల భాగంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## నేడు తిరుమలలో హనుమజ్జయంతి - అంజనాద్రిలో వేడుకలు



**తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలోని అంజనాద్రిలో బాలహనుమంతుని ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించడం పరిపాటి. ప్రతి సంవత్సరం వైశాఖ మాసం బహుళదశమినాడు తిరుమలలో ఘనంగా నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించనుంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న బేడి ఆంజనేయస్వామికి, కాలినడకబాటలో ఏడవ మైలు వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామికి హనుమజ్జయంతినాడు ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. తిరుమల జాపాలి తీర్థంలో కూడా హనుమజ్జయంతి ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడుతుంది. నేడు సాంప్రదాయానుసారం టిటిడి తరపున జపాలి హనుమాన్ కు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. టిటిడికి అనుబంధంగా ఉన్న పలు ఆలయాల్లోనూ నేడు హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. తిరుపతిలోని కోదండరామస్వామి లయం, గోవిందరాజస్వామి ఆలయం, అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాలతో పాటు టిటిడికి చెందిన ఇతర అనుబంధ ఆలయాల్లో నేడుహనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శరణాగత భక్తికి, అచంచల శ్రీరామ సేవకు ప్రతీకగా నిలిచిన ఆంజనేయస్వామి జయంతిని టిటిడి ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## 23 నుండి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు -మే 27న గరుడసేవ - మే 30న రథోత్సవం

**తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధమైన తిరుపతిలో వెలసిన గోవిందరాజస్వామి ఆలయంలో గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మే 22వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య స్వామి వివిధ వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.-వాహనసేవల విశేషాలు :ఈనెల 23వతేదీ ధ్వజారోహణం, పెద్దశేష వాహనంసేవలు, ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు. 24న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై స్వామివారు విహరించనున్నారు. 25న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనసేవ భక్తులను అలరించనున్నాయి. 26వతేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. మే 27న ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను కటాక్షి ంచనుండగా, రాత్రి జరిగే గరుడవాహనసేవ బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 28న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనసేవలు భక్తులను భక్తిరసంలో ముంచెత్తనున్నాయి. అలాగే 29వతేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. 30న ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుండగా, రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించనున్నారు.

## పాతపట్నం నీలమణిదుర్గ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, మే 11 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం శ్రీ నీలమణి దుర్గ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర దేవాదాయ శాఖ నుండి నలబై లక్షల రూపాయాల నిధులు మంజూరు కావడం శుభపరిణామమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు విడుదల కావడంతో దేవాదాయ శాఖామంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడులకు ధన్యవాదాలు తెలిపారు. దేవాదాయ శాఖ నుండి 40 లక్షలు, మ్యాచింగ్ కంట్రీబ్యూషన్ క్రింద మరో పది లక్షలు కలిపి మొత్తంగా 50 లక్షల రూపాయల నిధులతో ఆలయం చుట్టూ అందమైన కాంపౌండ్ వాల్, పండగల సమయంలో అవసరానికి సరిపడా షెడ్డుల నిర్మాణం చేపట్టనున్నారని అన్నారు. కూటమి సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉత్తరాంధ్రకు, అందులో ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిన చంద్రబాబు నాయుడు అన్ని ప్రాంతాలకు సమాన వృద్ధి సాధించేలా తోడ్పాటు అందిస్తున్నారని అన్నారు. పాతపట్నం ఆలయ అభివృద్ధికి, స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తో కలసి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. తాజాగా మంజూరు అయిన నిధుల విషయంలో మామిడి గోవిందరావు చాలా కృషి చేశారని కితాబిచ్చారు. ఆలయ ప్రాముఖ్యతకు ప్రాధాన్యత ఇస్తూ ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు విడుదల కావడం, మరోవైపు ఆలయానికి ఎదురుగా ఫ్లై ఓవర్ నిర్మాణంలో సైతం ఉత్సవాలకు వీలుగా డిజైన్ మార్పులు జరగడం తమ ప్రభుత్వ నిబద్ధతను తెలుపుతోందని రామ్మోహన్ అన్నారు.

## ఎసిబి వలలో మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఆరోగ్యాధికారి డి.లక్ష్మీనరసింహ, జూనియర్ అసిస్టెంట్ సందీప్

### - శానిటేషన్ సర్టిఫికేట్ ఇవ్వడానికి 25 వేలు లంచం డిమాండ్

**అనంతపురం మే 11 ప్రభాతవార్త** నగరపాలక సంస్థలో ఇన్‌ఛార్జ్ ఆరోగ్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డి.లక్ష్మీనరసింహ, ఆరోగ్య విభాగపు జూనియర్ అసిస్టెంట్ సందీప్‌లు ఎగ్జిబిషన్ ఏర్పాటు కోసం శానిటేషన్ సర్టిఫికేట్ జారీ చేయడానికి ఎగ్జిబిషన్ నిర్వాహకుని వద్ద నుంచి రూ.25వేలు లంచం తీసకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సోమవారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు వీరి సంభాషణలను పూర్తిస్థాయిలో రికార్డు చేసకుంటూ మధ్యాహ్నం స్థానిక రైతు బజారు వద్ద జూనియర్ అసిస్టెంట్ సందీప్ 25వేలు లంచం తీసుకుంటుండగా నేరుగా ఏసీబీ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి బృందం పట్టుకుంది. అనంతరం సంబంధిత పర్యవేక్షణాధికారి ఆదేశాల మేరకు లంచం తీసకుంటున్నట్లు జూనియర్ అసిస్టెంట్ తెలుపగా నగరపాలకసంస్థ కార్యాలయానికి చేరుకొని ఇన్‌ఛార్జ్ ఆరోగ్యాధికారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసారు.

## సుపరిపాలన కోసమే మహానాడు.. నెల్లూరులో చారిత్రక ఘట్టం!

### - 250 ఎకరాల్లో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు : మంత్రి నారాయణ

**కొడవలూరు (నెల్లూరు), మే 11, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రజలకు పారదర్శకమైన, మెరుగైన సుపరిపాలన అందించడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ వార్షిక పండుగ`మహానాడు'ను ఈసారి నెల్లూరు వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో మే 27, 28, 29 తేదీల్లో జరగనున్న ఈ భారీ వేడుకల ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం స్వయంగా పరిశీలించారు. 250 ఎకరాల విస్తీర్ణంలో సాగుతున్న పనులను అణువణువూ చుట్టేసిన మంత్రి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏర్పాట్లపై సమగ్ర వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందేలా చేయడమే ఈ మహానాడు ముఖ్య ఉద్దేశం. నెల్లూరు చరిత్రలో నిలిచిపోయేలా ఈ పసుపు పండుగను నిర్వహిస్తున్నాం. ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 6 వేల బస్సులు వచ్చే అవకాశం ఉంది. దానికి తగ్గట్లుగా ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా భారీ పార్కింగ్ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

# వైభవంగా శ్రీరామ భక్త అభయ వీరాంజనేయ స్వామి నూతన శిల ఆలయ జీర్ణోద్ధారణ, పునఃప్రతిష్ట

**విజయవాడ, మే 11 (ప్రభాతవార్త):** విజయవాడ, పాల ఫ్యాక్టరీ ఎదురుగా శ్రీరామ భక్త అభయ వీరాంజనేయ స్వామి వారి నూతన శిళ ఆలయ జీర్ణోద్దారణ, పునప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. త్రిదండి చినజీయర్ స్వామి, దుర్గాప్రసాద్ స్వామి, బీ.ఆర్.యస్. నేత హరీష్ రావు, కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. చిన జీయర్ స్వామి చేతుల మీదుగా కుంబాభిషేకం, దివ్య అనుగ్రహం నిర్వహించారు. 30 ఏళ్ళ క్రితం ఇక్కడ దుర్గాప్రసాద్ స్వామిజీ ఆధ్వర్యంలో హనుమత్ పీఠాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ శాశ్వతంగా ఉండేలా స్వామి వారి సన్నిధానాన్ని ఏర్పాటు చేసి ఆంజనేయ స్వామి విగ్రహం పునం ప్రతిష్ట చేశారు. . వైశాఖమాసం, కృష్ణపక్షంలో దశమి తిథి నాడు పూర్వ భాద్ర నక్షత్రం నాడు హనుమంతుడి ఆవిర్బావం జరిగిందని, నవమి వెళ్లి దశమి వచ్చింది. నేడు, రేపు హనుమాన్ జయంతిని రెండు రోజులు జరుపుకుంటున్నాం అని త్రిదండి చిన జీయర్ స్వామి తెలిపారు. ముప్పై యేళ్ల క్రితం ఇక్కడికి వచ్చినపుడు కాలేజీ, ఆంజనేయస్వామి ఆలయం మాత్రమే ఉండేవి, ఆనాడు స్వామి వారిని ప్రతిష్టించుకునే అవకాశం నాకు కల్పించారని, మళ్లీ ఆంజనేయ స్వామిని నవ జవాలతో దర్శనం చేసుకునేలా దుర్గాప్రసాద్ స్వామి అద్భుతమైన పునాదిని తయారు చేశారని తెలిపారు. నేడు ఎంతోమంది అనేక ప్రాంతాల నుంచి ప్రతి మారు మూల నుంచి ప్రతినిధులు, స్వామి సేవకులు తరలి వస్తున్నారు. హనుమత్ దీక్ష పరులుగా... మీ కుటుంబాలు, మీ గ్రామాలకు, మీ రాష్ట్రాలకు, తద్వారా దేశానికి ధర్మ రక్షణ సైన్యంగా నిలబడినందుకు మంగళ శాసనాలు అంటూ చినజీయర్ స్వామి ప్రశంసించారు. ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్దరణకు చినజీయర్ స్వామీజీ రావడం సంతోషంగా ఉందని బి.ఆర్.ఎస్. నేత, తెలంగాణా రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మా స్వగ్రామంలో చెన్నకేశవ స్వామి పునప్రతిష్టకు కూడా చిన జీయర్ స్వామి విచ్చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సమాజాన్ని ప్రేమించాలి, సమానత్వాన్ని పాటించాలనే నినాదాన్ని పవిత్ర యజ్ఞంగా చినజీయర్ స్వామి ముందుకు తీసుకువెళుతున్నారు. హైదరాబాద్ లో స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీని నిదర్శనంగా చెప్పుకోవాలన్నారు. చినజీయర్ మనకు కనిపించే దైవం.. అందరూ అలాగే భావిస్తారు, నేడు ఆంజనేయ స్వామి విగ్రహం పునప్రతిష్ట జరగడం మంచి పరిణామం. దుర్గాప్రసాద్ స్వామి సిద్దపేటకే వచ్చి ఆంజనేయ దీక్షలు ప్రారంభిస్తుంటారు. ఇద్దరు స్వాములు లోక రక్షకులుగా నేడు ముందుకు తీసుకు వెళుతున్నారని హరీష్ రావు కొనియాడారు. సమాజంలో మార్పు కోసం, నిత్య లోక కళ్యాణం కోసం వారు కృషి చేస్తుంటారు. ఆంజనేయస్వామి క్రమశిక్షణకు మారు పేరు. విశ్వాసానికి,

విధేయతకు మారు పేరు. సాహసానికి, సమానత్వానికి మారు పేరు.. ఏ పనైనా వాయి వేగంతో దేవదేవులకే సాయం చేసిన మహనీయుడు ఆంజనేయస్వామి అని వివరించారు.



ఆత్కూరు గ్రామంలో పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ

# రాష్ట్రవ్యాప్తంగా లక్ష సిసికెమెరాలు : హోంమంత్రి అనిత

**ఉంగుటూరు(కృష్ణా), మే 11, ప్రభాతవార్త :** నేరాల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్‌స్టేషన్‌లకు అనుసంధానం చేస్తూ లక్ష సిసికెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్రహోంశాఖామం త్రి అనిత తెలిపారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో రూ.1.40కోట్లఖర్చుతో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని సోమవారం మధ్యాహ్నం మంత్రి ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో సిసిరోడ్లను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈపోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి 2018లో యం.వెంకయ్యానాయుడు శంకుస్థాపన చేయగా, గత ప్రభుత్వం ఐదేళ్ళు నిర్మాణాన్ని పట్టించుకోలేదని, గత ప్రభుత్వం అభివృద్ధిని ఎలా గాలికివదిలేపిందో ఈపోలీస్‌స్టేషన్ నిర్మాణం పెద్దఉదాహరణగా ఆమె పేర్కొన్నారు. గతంలో పెచ్చులు ఊడుతూ కూలిపోయే దుస్థితిలో ఉండే పోలీస్‌స్టేషన్ భవనాలను కార్పోరేట్‌స్థాయిలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గన్నవరం పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణాన్ని కంపెనీల సిఎస్ఆర్ నిధులతో చేపడతామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చెప్పటం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పరిపాలనాదక్షత కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో ఉద్యోగులకు జీతాలు, సామాజిక పించన్‌లు ప్రతి నెల ఒకటవతేదీనే ఇస్తున్నామన్నారు. కానిస్టేబుళ్ళ నియామకం, ఉపాధ్యాయుల నియామకం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. నేరాలు జరిగినపుడు నేరస్తులను పట్టుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్ష సిసికెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 70వేల కెమెరాలు ఏర్పాటు చేసామని వివరించారు. నేరాలు జరిగినప్పుడు 24గంటల్లోనే నేరస్తులను పట్టుకుంటున్నామని, పోక్సో కేసుల్లో మూడునెలల్లోనే నిందితులకు శిక్షలు పడేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత తెలిపారు. పోలీస్‌లు ఎక్కడా రాజీలేకుండా పనిచేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా టిడిపి అభ్యర్థిని గెలిపించాలని టిడిపి శ్రేణులు, కూటమి నాయకులు, కార్యకర్తలు కసిగా పనిచేసిన నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన యార్లగడ్డ వెంకట్రావ్ ప్రజల ఆశయాల మేరకు నియోజకవర్గం అభివృద్ధి చేస్తున్నారని మంత్రి కొనియాడారు. ఎక్సైజ్‌శాఖామంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నియోకజవర్గ అభివృద్ధికి నిరంతరాయంగా సియంతో, మంత్రులతో చర్చలు జరుపుతూ నిధులు తెస్తున్నారని యార్లగడ్డపై ప్రశంసల వర్షం కురిపించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడరూరల్ మండలంలోని 9గ్రామాలను కలిపి ఒక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈగ్రామానికి రూ.6.02కోట్లు నిధులు మంజూరు చేసామన్నారు. గతంలో ఈనియోజకవర్గంలో అక్రమ కేసులతో ప్రజల్ని వేధించేవారని, తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు ఒక్క అక్రమకేసు పెట్టలేదన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ శివనాగేశ్వరావు, ఐజి అశోక్‌కుమార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఏయంసి ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు తదితరులు కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు పెనమలూరు నియోజకవర్గం కంకిపాడులో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

## తప్పించుకునే ప్రయత్నంలో నీటిలో మునిగి వ్యక్తి మృతి

**నాగలాపురం, మే 11 ప్రభాతవార్త:** పేకాట స్థావరాలపై పోలీసుల దాడిచేయడంతో తప్పించుకునే ప్రయత్నంలో నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా నాగలాపురం మండలం కాలంజేరి గ్రామంలో చోటుచేసుకుంది. నాగలాపురం మండలం కాలంజేరి గ్రామం సమీపంలో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పేకాటరాయులు చేరుకుని పేకాట ఆడుతున్నారని గ్రామస్తులు సోమవారం మధ్యాహ్నం నాగలాపురం పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సునీల్ తన సిబ్బందితో కలిసి కాలంజేరి గ్రామ సమీపంలోని అరణియార్ రివర్ గట్టుమీద తన సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని తనిఖీ చేశారు. పేకాటరాయులు అక్కడ ఉన్న ద్విచక్రవాహనాలను వదిలివేసి అరణియార్ ఏరు గట్టు వైపు పరుగులు తీశారు. ఈ క్రమంలో నదిలోని నీటి ప్రవాహం ఎక్కువ ఉండడం వలన పుత్తూరుకు చెందిన ఈశ్వర్(55) నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. అతనితో ఉన్న మరో నలుగురు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. వారి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన సమాచారం అందుకున్న పుత్తూరు రూరల్ డీఎస్పీ రవికుమార్, సత్యవేడు సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# దుర్గమ్మ ఆలయంలో నేడు హనుమజ్జయంతి వేడుకలు



హైకోర్టు న్యాయమూర్తికి దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న ఇఒ

**ఇంద్రకీలాద్రి, మే 11, ప్రభాతవార్త :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో మంగళవారం నాడు వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఘాట్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి ఆలయం, శ్రీ అమ్మవారి ప్రధాన ఆలయంలో వేంచేసియున్న క్షేత్రపాలక ఆంజనేయ స్వామి వారి ఆలయం, మెట్ల మార్గంలోని శ్రీ ఆంజనేయ స్వామి వార్ల ఆలయాల్లో ఉదయం 6 గంటల నుండి అభిషేకాదులు, తమలపాకు (నాగవల్లి దళార్చన) పూజలు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఈ మూడు ఆలయాల్లో శ్రీ ఆంజనేయ స్వామివార్లను వర్ణమయ పుష్పాలంకారణలు గావించి పూజాదికాలు జరుపుతామన్నారు. ఈ విశేష పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఒ కోరారు. దుర్గమ్మవారిని ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ సోమవారం దర్శించుకున్నారు. వారికి శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు ఇఒ వికె శీనా నాయక్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయ ఇఒగా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇఒ వికె శీనా నాయక్‌ను ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఇఒగా వికె శీనా నాయక్ పలు నూతన సంస్కరణలు చేపట్టి భక్తుల మన్ననలందుకున్నారని, ఇదేవిధంగా మరిన్ని సంస్కరణలు చేసి మరింత సేవలను భక్తులకు అందించాలని ఆకాంక్షించారు. రాబోయే కృష్ణాపుష్కరాల్లో కూడా ఇదేవిధంగా విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. వారికి తమవంతు సహకారమందిస్తామన్నారు.

# రాబోయే మహానాడులో ప్రత్యేక చేనేత స్టాళ్లు ఏర్పాటు - ఆప్కోకు తొలిసారి టిటిడి ఆర్డర్ :మంత్రి సవిత

**సచివాలయం,మే 11,ప్రభాతవార్త :** నేతన్నలకు రెట్టింపు ఆదాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని,వారికి ఆర్థికమేలు కలిగేలా చేనేత సహకార సంఘాల చెంతకు వచ్చి చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని రాష్ట్ర చేనేత,జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు.ఇండెంట్‌లో పేర్కొన్న నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించాలని,ఆ సంస్థను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తున్నామని,ఇప్పటికే ఉచిత విద్యుత్ అందజేశామని తెలిపారు.చేనేతల ఆరోగ్యరక్షణకు యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొస్తున్నామని,నేతన్న భరోసా పథకం ద్వారా రూ.25వేలు ఆర్థికసాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో మంత్రి సవిత సోమవారం భేటీ అయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేతల బాగుకోరే ప్రభుత్వం తమదన్నారు.చేనేత కళాకారులు కాలరు ఎగరేసేలా బతకాలన్నది సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ ల లక్ష్యమన్నారు.365రోజులూ చేనేతలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23నెలల కాలంలో ఆప్కో ద్వారా రూ.190కోట్ల అమ్మకాలు చేశామన్నారు.ఆప్కో షో రూముల్లో అమ్మకాలు పెంచడానికి సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు.ఉచిత విద్యుత్ పథకం ద్వారా నేతన్నల కుటుంబాలకు ఎంతోమేలు కలుగుతోందన్నారు. చేనేత అమ్మకాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నామని,సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలుచేస్తున్నామని 6770చేనేత ఉత్పత్తులను 40ఆప్కో షోరూమ్ ల ద్వారా ఈ కామర్స్ ద్వారా విక్రయిస్తున్నామని వెల్లడించారు.బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్లకు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,మంత్రుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.గతేడాది నిర్వహించిన మహానాడు సహ టిటిడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు.ఈనెల 27,28,29తేదీల్లో నెల్లూరులో జరిగే మహానాడు సందర్భంగా చేనేత ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత, కమీషనర్ రేఖా రాణి

# ఎసిబి వలలో పెద్దతీనార్ల వీఆర్వో

**(నక్కపల్లి, ప్రభాతవార్త )** మండలంలోని పెదతీనార్ల వీఆర్వోగా పనిచేస్తున్న కొప్పిశెట్టి చిట్టిబాబు సోమవారం రైతు నుంచి లంచం తీసుకున్నటడగా ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. విశాఖకు చెందిన ముక్క శ్రీను అనే రైతు పెదతీనార్ల గ్రామంలో 2023లో 5.57 ఎకరాల భూమిని కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ భూమిలో 2:14 ఎకరాల భూమిని ఏపీఐఐసీ వారు తీసుక ని, నష్టపరిహారం అతనికి అందజేశారు. మిగిలిన 3.43 ఎకరాల భూమికి నష్టపరిహారం ఎందుకు పడలేదని తెలుసుకోవ డానికి రికార్డులు పరిశీలించగా, ఆ భూమి తన పేరున గాని, తనకు విక్రయించిన వారి పేరున గానీ లేకపోవడంతో బంగ తిన్నారు. ఆన్లైన్లో తన పేరు లేకపోవడంతో ఆశ్చర్యపోయి ఇదేమిటని రెవెన్యూ అధికారులను అడిగారు. తన పేరును 3.43 ఎకరాల భూమి మ్యుటేషన్ చేసి, ఆన్లైన్లో ఎక్కించాలని వీఆర్వో కొప్పిశెట్టి చిట్టిబాబును కోరగా, అందకు ఆయన తాను అడిగింది ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, అంత ఇచ్చుకోలేనని కొంత ఇవ్వగ లనని చెప్పిన బాధితుడు ముక్క శ్రీను ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి నేతృ త్వంలో బృందం నిఘా వేసింది. సోమవారం విశాఖ ఎయిర్పోర్టుకు రూ 1.50 లక్షలు నగదు తీసుకురావాలని వీఆర్వో చి ట్టిబాబు చెప్పడంతో బాధితుడు శ్రీను అక్కడకు వెళ్లి 1.50లక్షలు లంచం ఇస్తుండగా మాటువేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.వీఆర్వోను నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. అనేక రికార్డులు పరిశీలించారు. ఇదే సమయంలో ఉపమాకలో వున్న ఆయన నివాస గృహం, విశాఖలో వున్న గృహాల్లో కూడా సోదాలు చేస్తున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి చెప్పారు. వీఆర్వో చిట్టిబాబును అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో డీఎస్పీ హర్షిత, సీఐలు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, సుప్రియ వున్నారు.



# సున్నపుకుండల అలంకరణలో తాతయ్యగుంటగంగమ్మ

**తిరుపతి,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయం జాతరవేడుకల్లో సోమవారం సున్నపుకుండల వేషంతో అమ్మవారు వైభవంగా దర్శనమిచ్చారు. ఈ వేషాన్ని ధరించిన భక్తులు సంప్రదాయబద్ధంగా జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టి, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ ఎ.జయకుమార్,సభ్యులు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు.

# సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

## - ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్‌లోతేటి

**తిరుపతి,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతివారం డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండికి వస్తున్న ఫిర్యాదుల పరిష్కారంపై ,సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు.తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం "డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 , 1800 425 155333కు కాల్ చేయడం ,వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని సిఎండి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్(ఎఫ్ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, కే. సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు జగదీష్, భాస్కర్ రెడ్డి, లత తదితరులు పాల్గొన్నారు.

# సోమనాథ్ స్ఫూర్తితో కైలాసగిరికి ఆధ్యాత్మిక వైభవం

## త్రిశూల ప్రతిష్ఠతో విశాఖకు కొత్త గుర్తింపు : పి.వి.ఎన్. మాధవ్




**విశాఖపట్నం, మే 11, ప్రభాతవార్త** విశాఖలోని కైలాసగిరి కొండపై నూతనంగా ఏర్పాటు చేసిన భారీ త్రిశూలం వద్ద 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. విశాఖ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పరశురాం రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి 75 ఏళ్లు పూర్తవుతున్న వేళ కైలాసగిరిపై త్రిశూల ప్రతిష్ఠ జరగడం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమని అన్నారు. ఈ త్రిశూల నిర్మాణంతో కైలాసగిరి పూర్తి స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. విశాఖ ప్రజలకు, పర్యాటకులకు ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగిందని, అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ఆలయం ప్రారంభమైందని గుర్తు చేశారు. విదేశీ దాడులతో దెబ్బతిన్న భారతీయ ఆధ్యాత్మిక గౌరవాన్ని తిరిగి నిలబెట్టిన చారిత్రక ఘట్టమే సోమనాథ్ పునర్నిర్మాణమని వ్యాఖ్యానించారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగ క్షేత్రాల అభివృద్ధి జరుగుతోందని తెలిపారు."స్వాభిమాన్ పర్వ్","స్వాభిమాన్ జాగరణ" కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఇంజిన్ల ప్రభుత్వం కొనసాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కైలాసగిరి ప్రాంతం మొత్తం భక్తులతో సందడిగా మారింది.

# తిరుమలలో తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



**తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో తప్పిపోయిన బాలుడ్ని పోలీసులు సకాలంలో గమనించి పట్టుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తిరుమలలో సిఆర్ఒ సమీపంలో పోలీసులు, విజిలెన్స్ అధికారులు సిబ్బంది ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్న సందర్భంగా కళ్యాణి సత్రం ముందు సుమారు నాలుగేళ్ల బాలుడు ఒంటరిగా ఏడుస్తూ కనిపించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది బాలుడిని చేరదీశారు. బాలుడి ఫోటో, వివరాలను కమాండ్ కంట్రోల్, ట్రాఫిక్ సిబ్బంది విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంలోని సిబ్బందిని అప్రమత్తం చేసి చిన్నారి కుటుంబ సభ్యుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో బాలుడు తప్పిపోయిన అరగంటలోపే అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తెలంగాణ రాష్ట్రం, ములుగు జిల్లాకు చెందిన రాజేష్, సరిత దంపతులకు నాలుగేళ్ల కుమారుడు మోహిత్‌ను సురక్షి తంగా అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించినందుకు బాలుడి తల్లి దండ్రులు పోలీసులు, విజిలెన్స్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు

# ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులకు ఐదుగురి ఎంపిక :వైద్యారోగ్య శాఖ

## గుంటూరులో ప్రదానం చేయనున్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ మే 11 ప్రభాతవార్త ప్రతినిధి:** 2025 సంవత్సరానికి గాను నర్సింగ్ రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న ఐదుగురికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల్ని ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రకటించింది. ఇంటర్నేషనల్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రకటించింది. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ ఐదుగురికి గుంటూరులో మంగళవారం నాడు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రధానం చేయనున్నారు. పరిశోధన, బోధన, రోగుల సేవ, ఇతర కేటగిరీల పనితీరులో వీరు ఉత్తమ పనితీరు కనబరిచారని అధికారులు తెలిపారు. అవార్డు గ్రహీతలు డాక్టర్ బి.వనజ కుమారి కి బెస్ట్ నర్స్ రీసెర్చర్, డాక్టర్ సి.ఆర్.సంషేర్ బేగం కు బెస్ట్ నర్స్ అడ్మినిస్ట్రేటర్, డాక్టర్ కె.సుగంతి కు బెస్ట్ నర్స్ ఎడ్యుకేటర్, ఎస్.చిన్నమ్మి కు బెస్ట్ నిర్సంగ్ సర్వీసెస్, కె.సావిత్రి కు క్యాటగిరీ ఆఫ్ బెస్ట్ ఎఎన్ఎం అవార్డుల్ని ప్రదానం చేస్తారు.

# బాల్య వివాహాన్ని అడ్డుకున్న పల్నాడు ఇన్‌చార్జి కలెక్టర్

**గుంటూరు మే 11 ప్రభాత వార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని రామచంద్రాపురం తండాలో ఒక బాల్య వివాహాన్ని ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహ్ చాకచక్యంగా అడ్డుకున్నారు. సమాచారం అందిన వెంటనే స్పందించి, అధికారులను అప్రమత్తం చేయడంతో ఓ చిన్నారిని కాపాడటంలో విజయవంతం అయ్యారు.రామచంద్రాపురం తండాలో ఒక మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లు అర్ధరాతి 2 గంటలకు సమాచారం అందుకున్న ఇంచార్జ్ కలెక్టర్, వెంటనే సంబంధిత అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెల్దుర్తి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, ఎస్.ఐ, ఐ.సి.డి.ఎస్ మరియు చైల్డ్‌లైన్ ప్రతినిధులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు బాలిక వయస్సు ధృవీకరణ పత్రాలను పరిశీలించగా, వివాహానికి చట్టబద్ధమైన వయస్సు నిండలేదని నిర్ధారణ అయ్యింది. దీంతో అధికారులు వెంటనే వివాహాన్ని నిలిపివేసి, బాలికను సంరక్షణలోకి తీసుకున్నారు.పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేసే బాల్య వివాహాలను జరపవద్దని ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహ్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం వివాహానికి బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండడం తప్పనిసరి అన్నారు.

నిబంధనలు అతిక్రమించి బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులు, ఇందుకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# తాతయ్యగుంట గంగమ్మ కు శక్తి పీఠాధీశ్వరీ రమ్యానంద భారతీ సారె

**తిరుపతి,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన ధర్మ పరిరక్షణ, శక్తి ఉపాసన, భక్తి మార్గ ప్రచారంలో నిత్యం నిమగ్నమై ఉన్న శక్తి పీఠాధీశ్వరీ రమ్యానంద భారతీ మహాస్వామిని సోమవారం సాయంత్రం తిరుపతితాతయ్యగుంట గంగమ్మకు సారెను సమర్పించారు. తిరుపతిలోని గ్రామదేవతల ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దివ్య దర్శన యాత్ర భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. ముందుగా తాళ్లపాక పెద్ద గంగమ్మ అమ్మవారి దర్శనం తొలుత అమ్మవారి అక్కగా భక్తులు విశ్వసించే పవిత్రక్షేత్రమైన తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయానికి విచ్చేసిన రమ్యానందభారతి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని శాస్త్రోక్త పూజలు నిర్వహించారు.

అనంతరం అమ్మవారికి పవిత్ర పట్టు వస్త్రాలు సమర్పించి తమ భక్తి సమర్పణను తెలియజేశారు.ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ వేదవతి తీర్థప్రసాదాలను అందజేశారు. తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారిని స్వామిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య విశేష పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్ర సమర్పణ చేశారు. భక్తుల శ్రేయస్సు, లోకక్షేమం, ధార్మిక చైతన్యం విస్తరించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ ఇఒ జయకుమార్ మాతాజీ కి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

# తెలంగాణలో మాజీ ఐపిఎస్ ఇంట్లో షాహి ముఠా దోపిడీ

## ఢిల్లీలో స్కెచ్.. హైదరాబాద్‌లో అమలుపథకంలో ఎనిమిది మందికిపైగా ప్రమేయం!

### ముగ్గురిని విచారిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 11, ప్రభాతవార్త:** మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే నివాసంలో దోపిడి, హత్య సంఘటనలో 'షాహి' ముఠా పాత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దోపిడికి పక్కాగా పథకం వేసినట్లు అనుమానిస్తున్నారు. ఢిల్లీలో పథకం వేసి నగరంలో అమలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే కల్పన తల్లిదండ్రు లతోపాటు నిందితుల్లో ఒకరికి డబ్బులు పంపిణీ చేసిన మరో వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ దోపిడి వెనుక దాదాపు ఎనిమిది మందికిపైగా ప్రమేయం ఉన్నట్లు పోలీసులు పోలీసులు అనుమానిస్తున్నారు..

**ఢిల్లీ నుంచి ఆపరేషన్ :** దోపిడిలో కల్పన అలియాస్ ధర్మ, సుజన్ షాహి అలి యాస్ సురేష్ సాయి, గణేష్ సాహి, భరత్ పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తిం చారు. ఇందులో సుజన్ షాహి ఢిల్లీలో ఉండటమే కాకుండా గతంలో ఒక దోపిడిలో అరెస్ట్ అయినట్లు తెలుస్తుంది. ఇతనితోపాటు గణేష్ షాహి, భరత్‌లను పూణేకు చెందిన దేవేంద్ర అనే వ్యక్తి కల్పన నివసించే మాజీ డీజీపీ నివాసానికి పంపినట్లు తెలుస్తుంది. అ క్రమంలోనే సుజన్ షాహికి దోపిడికి ముందు కొంత డబ్బులు సైతం ఖాతాకు బదిలీ చేసినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ వ్యవహారంలో వీరి అయిదుగురితోపాటు మరో ముగ్గురు, నలుగురు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నేరం చేసిన అనంతరం ఎవరు ఎక్కడికి ఎలా వెళ్లాలనే పథకాన్ని సైతం ముందుగానే రచించుకున్నారు. నగరం నుంచి రైలులో నాగపూర్ వైపు వెళ్లిన నిందితులు నాగపూర్‌కు ముందుగా వచ్చే స్టేషన్‌లోనే రైలు దిగారు. అక్కడ ఒక మద్యం దుకాణంలోకి వెళ్లి వచ్చిన అనంతరం మరో రైలు ఎక్కినట్లు గుర్తించారు. అనంతరం అక్కడి నుంచి మరో ప్రాంతానికి వేర్వేరుగా వెళ్లినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఒక నిందితుడు ఇప్పటికే సరిహద్దు దాటి లోపలికి ప్రవేశిం చినట్లు సమాచారం. అయితే నిందితులు తీసుకెళ్లిన బంగారు ఆభరణాలను పథకంలో భాగస్వాములై ఉన్న వేరే వ్యక్తుల ద్వారా తరలించినట్లు అనుమానిస్తున్నారు.

**గిల్టు నగలుగా భావించి:** దోపిడి, హత్య రోజున దుండగులు దాదాపు 225 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసుకెళ్లినట్లు పోలీ సులకు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. అయితే సంఘటన జరిగిన రాత్రి మాజీ ఐపీఎస్ నివాసంలో మరో ఆభరణాల పెట్టె లభించింది. అందులో ఉన్న దాదాపు 20 తులాల బంగారు ఆభరణాలు గిల్టుగా భావించి నిందితులు చూసినప్పటికి అక్కడే వదిలివెళ్లారు. వాస్తవానికి అవి బంగారు నగలే అయినప్పటికి నిం దితులు తప్పుగా అంచనా వేయడంతో ఆయా నగలు బాధితులకు దక్కాయి.

## ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్ సన్‌రైజింగ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్.. సొంతగడ్డపై ఇరగదీసింది. సొంతగడ్డ ఇచ్చిన విజయాల బూస్టింగ్‌తో హైదరాబాద్ వెలుపల జరిగిన మ్యాచ్‌ల్లోనూ విజయాలు అందుకుంది. ఉప్పల్ స్టేడియం ఈ సీజన్‌లో లక్కీగా నిలిచింది. 6 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు అందుకుంది. ఇక హైదరాబాద్ వెలుపల సన్‌రైజర్స్ ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడితే మూడింటిలో నెగ్గింది. ఇంటా బయటా రెండేసి పరాజయాలు ఎదుర్కొంది. నేటి మ్యాచ్‌తో కలుపుకుని మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా, అందులో ఒకటి ఉప్పల్ స్టేడియంలో, రెండు హైదరాబాద్ వెలుపల ఆడనుంది. ఈ మూడింటిలో రెండు నెగ్గినా సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్లే ఆఫ్ బెర్త్ ఖాయం.

1 **చిన్నస్వామి స్టేడియం బెంగళూర్**
ఫలితం : 6 వికెట్ల తేడాతో ఓటమి
ఆర్సీబీ-203/4, ఎస్ఆర్‌హెచ్ -201/9

2 **ఈడెన్ గార్డెన్స్ కోల్‌కతా**
ఫలితం: 65 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-226/8, కేకేఆర్-161

3 **ఉప్పల్ స్టేడియం హైదరాబాద్**
ఫలితం: 5 వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్- 156/9, లక్నో-160/5

4 **న్యూ చండీఘర్ స్టేడియం**
ఫలితం: ఆరు వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్ -219/6, పంజాబ్-223/4

5 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 57పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-216/6, రాజస్థాన్- 159

6 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: పది పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్- 194/9, సీఎస్‌కే -184/8

7 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 47 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-242/2, ఢిల్లీ- 195/9

8 **సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం, జైపూర్**
ఫలితం: 5వికెట్ల తేడాతో విజయం
రాజస్థాన్-228/6, ఎస్ఆర్‌హెచ్ 229/4

9 **వాంఖడే స్టేడియం, ముంబై**
ఫలితం: 6 వికెట్ల తేడాతో విజయం
ముంబై -243/5, ఎస్ఆర్‌హెచ్-249/4

10 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 7 వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్-165, కేకేఆర్: 169/3

11 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 33 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-235/4, పంజాబ్-202/7



# టాప్-2 కోసం టఫ్ ఫైట్

### ఆహ్మదాబాద్‌లో నేడు గుజరాత్ టైటాన్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్

**ఆహ్మదాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్ణయాత్మక దశకు చేరుకుంది. ప్లే ఆఫ్ బెర్త్ దక్కించుకోవాలంటే ఇక ఇక్కడి నుంచి అన్ని జట్లకే గెలుపే పరమావధిగా మారింది. ఈ పరిస్థితుల్లో 14పాయింట్లతో పాయింట్లపట్టికలో రెండోస్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్..నేడు కీలక మ్యాచ్ ఆడనుంది. ఆహ్మదాబాద్ నరేంద్రమోదీ స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. సొంతగడ్డపై విక్టరీతో ఆహ్మదాబాద్ వచ్చిన పాట్ కమిన్స్ సేన... ఇక్కడా గెలుపుతో ప్లే ఆఫ్ బెర్త్ ఖాయం చేసుకోవాలన్న పట్టుదలతో ఉంది.

శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించినప్పటికీ... రాజస్థాన్ రాయల్స్‌పై 77పరుగుల భారీ విజయంతో సహా వరుసగా నాలుగు విజయాలతో పుంజుకుంది. ఫుల్‌జోష్‌తో సొంతగడ్డపై మ్యాచ్‌కు సిద్ధమైంది. గుజరాత్ ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో సమవుత్యంగా ఉంది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ చక్కని ఫామ్‌లో ఉన్నారు. ఇద్దరూ గుజరాత్‌కు ఫ్లయింగ్ స్టార్ట్‌లు అందిస్తున్నారు. మరోసారి అలాంటి శుభారంభం లభిస్తే గుజరాత్‌కు తిరుగుండదు. ఇక మిడిల్ ఆర్డర్‌లో జోస్ బట్లర్, వాషింగ్టన్ సుందర్‌లపైనే ఎక్కువగ ఆధారపడుతోంది. ఈ నలుగురిలో ఇద్దరూ విఫలమైనా బ్యాటింగ్ పేకమేడను తలపిస్తోంది. వారి బౌలింగ్ దళం కూడా అంతే పటిష్టంగా ఉంది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహమ్మద్ సిరాజ్, రబడ పవర్ ప్లేలోనే వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్ల పతనాన్ని శాసిస్తున్నారు. మధ్య ఓవర్లలో రషీద్ ఖాన్ మ్యాచ్ మలుపు తిప్పే స్పెల్స్ చక్కగా తోడవుతున్నాయి.

ఇక పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు సాధించి, 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడం ద్వారా ఆరేంజ్ ఆర్మీ సరైన సమయంలో సరైన లయను అందుకుంది. ఇది సన్‌రైజర్స్ బ్యాటింగ్ సామర్థ్యాన్ని స్పష్టం చేస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిక్ క్లాసెన్‌లతో కూడిన టాప్‌ఆర్డర్ ఫైరింగ్‌లో ఉంది. అత్యంత విధ్వంసకర బ్యాటింగ్ యూనిట్లలో ఒకటిగా చాటుకుంది. అత్యంత దూకుడు వల్లే ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ 200 ప్లస్ స్కోర్లు సాధిస్తూ వస్తోంది. ముంబై ఇండియన్స్‌పై అత్యధికంగా 249 పరుగులతో సహా ఏకంగా ఎనిమిది సార్లు 200 ప్లస్ స్కోర్లు చేసింది. స్లాగ్ ఓవర్లలో సూపర్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి తన బ్యాటింగ్‌తో మెస్మరైజ్ చేస్తున్నాడు. సన్‌రైజర్స్ ఓడిన మ్యాచ్‌లన్నీ దాదాపు బ్యాటింగ్ వైఫల్యంతోనే. నిర్లక్ష్యం దరిచేరకుండా బ్యాటింగ్ కొనసాగిస్తే సన్‌రైజర్స్‌కు తిరుగుండదు. బౌలింగ్ దళం ప్రత్యర్థిని కట్టడిచేసే స్థాయిలో ఉంది. గాయం కారణంగా మొదటి అర్ధ భాగానికి దూరమైన కమిన్స్..తిరిగి జట్టులో చేరిన తర్వాత బౌలింగ్ అటాక్ బలంగా మారింది. శ్రీలంకన్ పేసర్ మలింగ ఈసీజన్‌లో అద్భుతంగా బౌలింగ్ చేస్తూ ప్రతి మ్యాచ్‌లో వికెట్లు అందిస్తున్నాడు. యంగ్ పేస్ గన్ సాకిబ్ హుస్సేన్ అదనపు బలంగా మారాడు. శివంగ్ కుమార్, రవిచంద్రన్ రూపంలో స్పిన్ వేరియేషన్ ఉంది.




**హెడ్ టు హెడ్**

సన్‌రైజర్స్‌పై గుజరాత్ టైటాన్స్ పైచేయిగా ఉంది. ఇరుజట్లు ఏడు మ్యాచ్‌ల్లో తలపడితే గుజరాత్ అయిదింటిలో నెగ్గింది. సన్‌రైజర్స ఒకే ఒక మ్యాచ్ 2022లో గెలుపొందింది. ఒక మ్యాచ్ రద్దయింది. 2025 సీజన్‌లో రెండు సార్లు కూడా గుజరాత్ టైటాన్స్ నెగ్గింది. ఈ సీజన్‌లో ఇరు జట్లు తొలిసారి ఢీకొంటున్నాయి.

**గుజరాత్ టైటాన్స్(అంచనా):** సుదర్శన్, గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్, సుందర్, హోల్డర్, తెవాటియా, నిశాంత్, రషీద్ ఖాన్, అర్షద్, కగిసో రబడ, సిరాజ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** కిషోర్

**సన్‌రైజర్స్ హైదరాబాద్ (అంచనా):** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, క్లాసెన్, నితీష్ రెడ్డి, సలీల్, రవిచంద్రన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), శివంగ్ కుమార్, మలింగ, సాకిబ్ హుస్సేన్; **ఇంపాక్ట్ ప్లేయర్:** హర్ష్ దూబే



## వన్డే ర్యాంకుల్లో టీమిండియా టాప్

**ముంబై:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా 118పాయింట్లతో మరోసారి నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలవగా, 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో ప్లేస్ లో కొనసాగుతోంది. అద్భుతమైన ప్రదర్శనలతో సౌతాఫ్రికా 102 పాయింట్లతో 4వ స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్(98)ని వెనక్కి నెట్టింది. శ్రీలంక(96), అఫ్గానిస్థాన్(93), ఇంగ్లాండ్(89), బంగ్లాదేశ్(84), వెస్టిండీస్(74)ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అలాగే ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టేసింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానంలో ఉంది. మరోవైపు అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకి స్కాట్లాండ్ కంటే ముందుకు వచ్చింది. కాగా ఐసీసీ ప్రకటించిన రూల్స్ ప్రకారం 2027 మార్చి 31వ తేదీ నాటికి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ -8లో నిలిచే జట్లు నేరుగా వన్డే వరల్డ్ కప్ 2027కు అర్హత సాధించనున్నాయి. ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి నేరుగా అర్హత పొందినప్పటికీ, దక్షిణాఫ్రికా టాప్8లోనే కొనసాగితే మరో టీమ్ కి ఛాన్స్

## పంజాబ్‌కు నాలుగో ఓటమి : గెలిచి నిలిచిన ఢిల్లీ

**ధర్మశాల:** ఐపీఎల్ 2026లో పంజాబ్ ఖాతాలో వరుసగా నాలుగో ఓటమి చేరింది. ఢిల్లీ క్యాపిటల్స్ కీలక పోరులో మూడు వికెట్లతో గెలుపొందింది. 211 పరుగుల భారీ టార్గెట్‌ను మరో ఓవర్ మిగిలి ఉండగానే అందుకుని ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. అయిదో విజయంతో పది పాయింట్లకు చేరుకుంది.

భారీ లక్ష్య చేధనలో ఢిల్లీ ఆరంభంలో తడబడింది. కేఎల్ రాహుల్(9)ను అవుట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికిన అర్ష దీప్ సింగ్.. అదే ఊపులో సాహిల్ ఫారిఖ్(13)ను కూడా పెవిలియన్ పంపాడు. మరో ఎండ్‌లో అభిషేక్ పోరెల్(5)ను యష్ ఠాకూర్ క్లీన్ బౌల్డ్ చేయగా, ట్రిస్టన్ స్టబ్స్(13) కొన్నొలీ అద్భుత త్రోకు రనౌట్ అయ్యాడు. దీంతో ఢిల్లీ 74 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయింది, ఈ దశలో కెప్టెన్ అక్షర్ పటేల్(30 బంతుల్లో 56), డేవిడ్ మిల్లర్(28 బంతుల్లో 51) ధాటిగా ఆడుతూ విజయానికి బాటలు వేశారు. చివర్లో అశుతోష్(24), మాధవ్ తివారీ(18) మెరుపు బ్యాటింగ్‌తో ఢిల్లీకి విజయాన్ని ఖాయం చేశారు.







టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు ప్రియాంన్ష ఆర్య(33 బంతుల్లో 56; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(18)అదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఇన్నింగ్స్ మొదటి ఓవర్ లోనే రెండు సిక్సర్లు, ఒక ఫోర్, 5 వైడ్లతో కలిపి ఏకంగా 22 పరుగులు రాబట్టారు. ఈ క్రమంలోనే పంజాబ్ కింగ్స్ కేవలం 2.4 ఓవర్లలోనే 50 పరుగుల మైలురాయిని అందుకుంది. ఇక క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే బాదుడు మొదలు పెట్టిన ప్రియాంష్ ఆర్య కేవలం 24 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేశాడు. ఓపెనర్లు అవుటైన తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(36 బంతుల్లో 59; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కూపర్ కొన్నోలీ(38) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని జోడించారు. కొన్నోలీ అవుటైన తర్వాత మార్కస్ స్టోయినిస్, శశాంక్ సింగ్‌లను స్టార్క్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా శ్రేయస్ అయ్యర్ నిలకడగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. చివర్లో సూర్యాంశ్ షెడ్గే(8 బంతుల్లో 21) భారీ షాట్లతో విరుచుకుపడటంతో పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 210కి చేరుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మాధవ్ తివారీ తలో రెండు వికెట్లు తీసుకోగా, ముకేష్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు.




### మార్కెట్లపై ప్రధాని మోడీ ప్రకటన ఒత్తిళ్లు

## జ్యుయెలరీ షేర్లు భారీ పతనం నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, మే 11:** ఇరాన్ శాంతిప్రతిపాదనలకు ట్రంప్ నో చెప్పడం, ప్రధాని మోడీ బంగారం కొనవద్దని, పెట్రోడీజిల్ వాడకం పొదుపు చేయాలని కోరుతూ చేసిన ప్రకటనలు స్టాక్ మార్కెట్లను ముంచేసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1312.91 పాయింట్లు క్షీణించి 76,015.28 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 360.30 పాయింట్లు క్షీణించి 23,815.85 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగించింది మూడు ట్రేడింగ్ సెషన్లలోను సెన్సెక్స్ 2.5శాతం, నిఫ్టీ సూచీ 2.1శాతం క్షీణించింది. భారతి ఎయిర్‌టెల్ 4.18శాతం, రిలయన్స్ 3.31 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 2.13శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో ట్రేడింగ్ టర్నోవర్ ఒక్కరోజే ఆరులక్షలకోట్లు క్షీణించినట్లుతేలింది. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ కూడా 1.26శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.96శాతం దిగజారింది.

మార్కెట్లపరంగా బిఎస్ఇలో కేవలం 1358 కంపెనీలు మాత్రమే పెరిగాయి. మూడువేల కంపెనీల షేర్లు క్షీణించాయి. 192షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 95.31వద్ద ముగిసింది. ముందురోజు చెలామణి 94.49వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ సెటిల్‌మెంట్లు రూ.1,51,975కి చేరాయి. కమొడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు జులై సెటిల్‌మెంట్ దరలు 2.25 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 103.54 డాలర్లుగా కొనసాగింది. విదేశీ మార్కెట్లపరంగా ఎస్అండ్‌పి 500సూచీ 0.84శాతంపెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ 1.71శాతంపెరిగితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 12.19 పాయింటు పెరిగింది. వ్యవసాయేతర ఉపాధి కొలువులు 1.15 లక్షలుగా ఉన్నట్లు తేలింది. 55వేల వరకూ ఉంటాయన్న అంచనాలను అధిగమించింది. అమెరికా నిరుద్యోగిత రేటు 4.3శాతంగా ఉంది.

ఇక ప్రధానిమోడీ చేసిన ప్రకటనతో జ్యూయెలరీ షేర్లుభారీ పతనం చెందాయి. ఏడాదిపాటు బంగారం కొనవద్దంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు జ్యుయెలరీ, బంగారం కంపెనీలపై భారీ ఒత్తిడిని తెచ్చాయి. కల్యాణ్ జ్యుయెలర్స్ 9.23శాతం, సెన్‌కో గోల్డ్ 8.61శాతం క్షీణిస్తే టైటాన్ కంపెనీ 6.83శాతం, స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ 6.63శాతం క్షీణించాయి. తంగమయిల జ్యుయెలరీ 5.69శాతం, పిసి జ్యుయెలరీస్ 4.94 శాతం చొప్పున క్షీణించాయి. ఎయిర్‌లైన్స్‌లో ఇండిగో స్టాక్ 4.94శాతం, స్పైస్‌జెట్ 4.72శాతం క్షీణించింది. ఎంసిఎక్స్ ఇండియా 2.92శాతం పెరిగింది. టాటాకన్స్యూమర్ ప్రొడక్ట్స్ 8.32శాతం, బిర్లా కార్పొరేషన్ 7.15శాతం, డ్రిండ్‌వెల్ నార్టన్ 6.61శాతం, కెనరాబ్యాంకు3.72శాతం, ఉత్కర్ష్ స్మాల్‌ఫైనాన్స్ 8.38శాతం చొప్పున క్షీణించాయి. బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ సైతం7.40శాతం, ఆర్తి సర్‌ఫాక్టెంట్ 10.82శాతం పతనం అయ్యాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.97శాతం పెరిగాయి.




## పెట్రోడీజిల్, గ్యాస్ ధరల పెంపు?

**ముంబయి, మే 11:** ఇంధనం, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించుకోవాలని, ప్రజా రవాణాను, కార్ పూలింగ్‌ను ఉపయోగించుకోవాలని ప్రధాని మోడీ చేసిన సూచనలు ఇంధన ధరల పెంపును స్పష్టంచేస్తున్నాయి. వర్క్ ఫ్రమ్ హోం, ఆన్‌లైన్ మీటింగ్స్ పెట్టుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించుకోవాలని, కార్ల వినియోగం తగ్గించుకుని మెట్రో వంటి పబ్లిక్ రవాణా వ్యవస్థల్ని వాడుకోవాలని సూచించారు. మోడీ వ్యాఖ్యల నేపథ్యంలో దేశ ప్రజలకు పెట్రోల్, డీజిల్, గ్యా ధరలు పెరగబోతున్నాయని తెలిసింది. ఇక పశ్చిమాసియా యుద్ధం కారణంగా చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. చమురు సంస్థలకు రోజుకు వెయ్యి కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికే లక్షల కోట్లు నష్టం వాటిల్లింది. దీంతో ధరలు పెంచాలని కేంద్రాన్ని ఒత్తిడి చేస్తున్నాయి. మంత్రిత్వ శాఖల మధ్య చర్చల నేపథ్యంలో ఇంధన ధరల పెంపు భారీగా ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరల పెంపుపై ఆలోచనలు ప్రారంభించింది. ప్రస్తుతం ఈ త్రైమాసికంలో ఆయిల్ కంపెనీల అండర్ రికవరీలు రూ.2 లక్షల కోటకు చేరే అవకాశం ఉందని, అందులో సుమారు రూ.1 లక్ష కోట్ల నష్టం వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 24 గంటల్లోనే చమురు ధరలు పెరగవచ్చని వార్తలొస్తున్నాయి. ఆర్థిక, పెట్రోలియం మంత్రిత్వ శాఖలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పెంపు సమయం ప్రపంచ ముడి చమురు పోకడలు, ద్రవ్యోల్బణం, ఆర్థిక ఒత్తిళ్లు, ఇంధన ధరలను సమతుల్యం చేయడానికి ప్రభుత్వం తీసుకునే విధానంపై ఆధారపడి ఉంటుందని వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ముడి చమురు, గ్యాస్, ఎల్‌పీజీలను అధిక ధరకు కొనుగోలు చేస్తున్నప్పటికీ, వినియోగదారులను ఆదుకునేందుకు తుది ఉత్పత్తులను తక్కువ ధరకు అమ్ముతున్నాయని దీనివల్ల రోజుకు రూ. 1,000 కోట్ల వరకు నష్టాలు వస్తున్నాయని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. పెరుగుతున్న నష్టాలను పూడ్చుకోవడానికి ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే అవకాశం ఉందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి.

## 28 బోగస్ యాప్‌లు తొలగించిన గూగుల్

**ముంబయి, మే 11:** కాల్ హిస్టరీ వెల్లడిస్తామని, మీకు కాల్ చేసిన వ్యక్తుల వివరాలను అందిస్తామనే హామీతో ఈ స్పామ్ యాప్‌లను లక్షలాది మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ నకిలీ యాప్‌లకు కాల్ ఫాంటమ్ అని నామకరణం చేసారు. ఈ యాప్‌లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి 73లక్షలకు పైగా డౌన్‌లోడ్‌లు నమోదు చేశాయి. ఈ28ఆండ్రాయిడ్ యాప్‌లు ఎలా మోసం చేశాయంటే వినియోగదారుడు ఇచ్చిన ఏ ఫోన్ నెంబర్ ప్రైవేటు కాల్స్, ఎస్సెమ్మెస్ రికార్డులు, వాట్సాప్ కాల్ హిస్టరీని అయినా ఇవ్వగలమని ఈ నకిలీ యాప్స్ నమ్మించాయి. వాస్తవానికి ఈ యాప్‌లు నకిలీ డేటాను సృష్టించి, కల్పిత ఫలితాలను అందిస్తూ, సబ్‌స్క్రిప్షన్ కోసం వినియోగదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశాయి. భద్రతా పరిశోధక సంస్థ ఈఎస్ఈటీ వెల్లడించిన ప్రకారం, కాల్‌హిస్టరీ ఆఫ్ ఎనీ నెంబర్ అనే యాప్ గురించి రెడ్డిట్ పోస్టులో గుర్తించిన అనంతరం పూర్తి వివరాలు తెలుసుకోవడానికి విచారణ ప్రారంభించారు. ఇండియన్ గవర్నమెంట్.ఇన్ అనే డెవలపర్ పేరుతో ఈ పోస్టు ఉంది. దీని ప్రకారం వినియోగదారుడు అందించిన ఏ ఫోన్ నెంబర్ కాల్ హిస్టరీనైనా తిరిగి పొందవచ్చు. ఈ యాప్‌నకు భారత ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదు. ఇది అందించిన కాల్ హిస్టరీ డేటా పూర్తిగా కల్పితమని కూడా రీసెర్చర్స్ గుర్తించారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఇలాంటి మరో 27 యాప్‌లను పరిసోధకులు గుర్తించారు. 2025 డిసెంబర్ 16వ తేదీన ఈ యాప్‌ల గురించి గూగుల్‌కు నివేదించినట్లు ఈఎస్ఈటీ తెలిపింది.

## పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన 6.6శాతం వృద్ధి



**న్యూఢిల్లీ,మే 11:** దేశంలోని పట్టణ ప్రాంతాల్లో జనవరి మార్చి త్రైమాసికంలో 6.6శాతం ఉపాధిపెరిగిందని కేంద్ర అర్థగణాంక, పథక అమలు విభాగం సోమవారం ప్రకటించింది. అంతకుముందు త్రైమాసికంలో 6.7శాతం మాత్రమే ఉంది. రెగ్యులర్ వేతనం, లేదా నెలసరి జీతంతో కూడిన ఉపాధి గ్రామీణ ప్రాంతాల్లో భారీ వృద్ధితో ఉంది. 14.8శాతంనుంచి 15.5శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్లకుపైబడిన వారు ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నట్లు తేలింది. మాధ్యమిక, ప్రాదేశిక రంగాల్లో ఉపాధి కూడా గ్రామీణప్రాంతాల్లోనే ఎక్కువ ఉంది. 15 ఏళ్లకుపైబడిన వారి కార్మిక శక్తి భాగస్వామ్యం రేట్ జనవరి మార్చి త్రైమాసికంలో 55.5శాతంగా ఉంది. అంతకుముందు త్రైమాసికంలో 55.8శాతంకంటే స్వల్పంగా తగ్గింది. మోస్పీ వివరాలను బట్టిచూస్తే మహిళల కార్మికశక్తి భాగస్వామ్యం 34.7శాతంగా ఉంది. పట్టణప్రాంతాల్లో వర్కర్ జనాభా నిష్పత్తి కూడా స్థిరంగా 46.9శాతం వద్దనే ఉంది. మంత్రిత్వశాఖ విడుదలచేస్తే పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే ప్రకారంచూస్తే 15 ఏళ్లకుపైబడిన వారంతా కూడా ఉపాధిరంగంలో చొచ్చుకుపోతున్నారని తెలుస్తోంది. 2024 జనవరి నెలనుంచి పిఎల్ఎఫ్ఎస్ సర్వేకు ప్రామాణికంగా మోస్పి ప్రకటించింది.

## మ్యూచువల్ ఫండ్స్‌లోకి 38వేల కోట్ల పెట్టుబడులు

**ముంబయి, మే11:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి గతనెలలో రూ.38,440.20 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అదేమార్చిలో అయితే 40వేల 450.26కోట్లు రాగా ఏప్రిల్‌లో స్వల్పంగా తగ్గింది. మొత్తంగా మూచువల్ ఫండ్స్ రంగంలోకి రూ.3.22 లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చాయని ఆంఫీ వెల్లడించింది. అదే మార్చిలో రూ.2.39 లక్షలకోట్లు మాత్రమే అందాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ లోనికే ఎక్కువ పెట్టుబడులు రాగా లార్జ్ క్యాప్ ఫండ్స్ రూ.2524.61 కోట్లు వచ్చాయి. మిడ్‌క్యాప్ కేటగిరీలో 6551.40కోట్లు వచ్చాయి. స్మాల్‌క్యాప్‌ఫండ్స్ నికరంగా రూ.6885.90 కోట్లు పెట్టుబడులు ఏప్రిల్‌లోనేవచ్చాయని ఆంఫీ ప్రకటించింది. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి 10వేల 147.85 కోట్లవరకూ నిధులు వచ్చాయి. సెక్టోరల్, థెమాటిక్ ఫండ్స్ రూ.1949.36 కోట్లు వచ్చినట్లు మూచువల్‌ఫండ్స్ సంస్థల సంఘం ఆంఫీ తెలిపింది. డెట్స్ రంగంలోకి కూడా రూ.2.47 లక్షల కోట్లు ఏప్రిల్‌నెలలో పెట్టుబడులుగా వచ్చాయి. రాత్రికిరాత్రే రూ.31,420.45 కోట్లు వచ్చాయి. ఇక లిక్విడ్‌ఫండ్స్ రూ.1.65 లక్షలకోట్లు రాగా సిప్ పెట్టుబడులు రూ.31,115 కోట్లుగాఉ న్నాయి. ఇక హైబ్రిడ్ పాసివ్‌ఫండ్స్ రూ.20,565.24కోట్లుగా ఉన్నట్లు ఆంఫీ ప్రకటించింది. ఆర్బిటేజ్‌ఫండ్స్ రూ.12,378.46 కోట్లుగా ఉన్నాయి గోల్డ్ ఈటిఎఫ్‌లలోకి కూడా 3040.31కోట్లు పెట్టుబడుల రూపంలో వచ్చినట్లు తేలింది. ఇక కొత్తగా ఫండ్ ఆఫర్లు 11 వరకూ ఉన్నాయి. మొత్తం రూ.828 కోట్లు వచ్చాయి. ముందునెలతో పోలిస్తే అన్నివిభాగాల్లోను కొంతమేర తగ్గినట్లు తేలింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన పొదుపు సూత్రాలు, ధరల పెంపు సంకేతాలతో పెట్టుబడులు కొంత మేర మార్చినెలతో పోలిస్తే సన్నగిల్లాయి. ఇక పసిడిఈటిఎఫ్‌లలోకి కూడా3040.3 కోట్ల పెట్టుబడులువచ్చాయి. ఫిబ్రవరిలో ఇన్వెస్టర్లు 2266 కోట్లు పెట్టుబడులుపెడితే, నికరంగా గోల్డ్ ఇటిఎఫ్‌లలో 34శాతంపెట్టుబడులు పెరిగాయి.



## 86% ఉద్యోగులు ఎఐ వినియోగిస్తున్నా రాబడి తక్కువే!

**ముంబయి, మే 11:** భారతదేశంలోని కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం గణనీయంగా పెరిగింది. దేశంలో దాదాపు 86 శాతం మంది ఉద్యోగులు తమ రోజువారీ పనిలో ఏఐని వాడుతున్నప్పటికీ, దానిపై పెట్టిన పెట్టుబడికి తగిన రాబడి అంచనాలకు తగ్గట్టుగా ఉందని కేవలం 35 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ సగటు 22శాతం కంటే భారత్ మెరుగ్గా ఉండటం గమనార్హం. ఈ వివరాలను టెక్నాలజీ నిపుణుల సంస్థ ఇసాకా సోమవారం వెల్లడించింది. భారత్‌లోని 49శాతం సంస్థలు ఇప్పుడు పూర్తిస్థాయి, అధికారిక ఏఐ విధానాన్ని కలిగి ఉన్నాయి. 2025లో ఇది 32 శాతంగా ఉండగా, ఇప్పుడు గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు 38 శాతంతో పోలిస్తే ఇది అధికం. అయినప్పటికీ దేశంలోని 23శాతం సంస్థలు పరిమిత విధానాలతోనే సరిపెడుతుండగా, 20 శాతం సంస్థల్లో అసలు ఎలాంటి ఏఐ పాలసీ లేకపోవడం గమనార్హం. రోజువారీ పనుల్లో ఏఐ భాగమైనప్పటికీ పాలన, కార్యాచరణ సంసిద్ధతలో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. రాబడి విషయంలో ఉద్యోగుల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. 21 శాతం మంది రాబడి గురించి చెప్పడానికి ఇది చాలా తొందరపాటు అవుతుందనిచెప్పారు. మరో 21 శాతం మంది ఇప్పటివరకు పరిమిత రాబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇంకో 18 శాతం మందికి రాబడిపై ఎలాంటి అవగాహన లేదని తేలింది. భారతీయ ఉద్యోగులు ప్రధానంగా ఉత్పాదకత పెంచుకోవడానికి 56శాతం, పునరావృతమయ్యే పనులను ఆటోమేట్ చేయడానికి 55శాతం, కంటెంట్ రాసేందుకు 51శాతం, భారీ డేటాను విశ్లేషించడానికి 42శాతం ఏఐని ఉపయోగిస్తున్నట్లు సర్వేలో తేలింది. సర్వేలో పాల్గొన్న వారిలో 82 శాతం మంది తమ వృత్తికి ఏఐ నైపుణ్యాలు చాలా అవసరమని భావిస్తున్నారు. రాబోయే 12 నెలల్లో తమ సంస్థలో ఏఐ సంబంధిత ఉద్యోగాలు పెరుగుతాయని 57 శాతం మంది అంచనా వేస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at E-30 & 31, A.K. Nagar, Industrial Estate, Nellore-524004. Ph: 2348108.Fax:2348106, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2003/10109